జన రాజకీయం కోసం...


# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 9 పక్షపత్రిక సంచిక - 08

ఏప్రిల్ 16-30, 2018

₹ 10/-







# మార్క్సిజం శాశ్వత సత్యం కాదు !

- కార్ల్ మార్క్స్‌కి 200 ఏళ్లు
- రష్యా బోల్షివిక్ తిరుగుబాటుకు శతవసంతాలు
- నక్సల్బరీకి ఐదు పదులు



'రాష్ట్ర ప్రయోజనాలు - దేశ ఐక్యత - ఫెడరలిజం' లక్ష్యంగా...

## క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టంపై ఏపీ ముఖ్యమంత్రికి జేపీ లేఖ

# పూర్ణాస్ రెమిడి హాస్పిటల్స్

HYM
ISO 9001 : 2015 CERTIFIED

[ 100 పడకల సూపర్ స్పెషాలిటీ & ట్రామాకేర్ సెంటర్ ]

ఇస్కాన్ టెంపుల్ రోడ్, ఫెడరల్ బ్యాంక్ ప్రక్కన, తిరుపతి

ఫోన్ : 0877 - 2252255, సెల్ : 88866 86999, 88866 96999



డా॥ యస్. పూర్ణ చంద్రరావు
M.S.( Ortho ), MRCS ( London )
Knee & Joint
Replacement Surgeon

24/7
Emergency
Medical & Surgical IC
Ventilators
Head Injuries
Accident & Poisoning
Dialysis



డా॥ ఆర్.మాధురి గాంధీ
MBBS, PGDGM,
Fellow (Diabetology)
MANAGING DIRECTOR

| | |
|---|---|
| ఎమర్జన్సీ & పాలిట్రామా | ఆర్థోపెడిక్ సర్జరీ |
| యూరాలజి | నెఫ్రాలజీ |
| జనరల్ సర్జరీ | డయాబెటాలజి |
| జనరల్ మెడిసిన్ | న్యూరో సర్జరీ |
| డయాలసిస్ | ప్లాస్టిక్ సర్జరీ |
| కంటి వైద్య విభాగం | చెవి,ముక్కు,గొంతు |



NTR VIDYA SEVA
ESI
CGHS
EHS
APSPDCL
AROGYA SAHAYATHA
AROGYA RAKSHA
ALL HEALTH INSURANCE TPA'S
NBPPL

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక

ఏప్రిల్ 16-30, 2018 | సంపుటి - ౨ | సంచిక - 08




# కార్టూన్ కార్నర్

## లోపలి పేజీల్లో...

మా సిద్ధాంతంలో విప్పి చెప్పాల్సినంత........... 5
బహుముఖ కార్యాచరణే ప్రత్యామ్నాయం........ 7
మార్క్సిజం విలువైనదే కానీ........................ 10
కేటాయింపులెక్కువ... ఖర్చుపెట్టేది తక్కువ........16
అశోకుడి కాలం కంటే వెనకబడిన నేటి........... 21
చిన్న పట్టణాల అభివృద్ధితోనే ఉపాధి............ 23
కార్పొరేట్లకు దోచిపెడుతున్న ఎన్టీఆర్ వైద్యసేవ... 24
పరిష్కారాలను వెదకటం విద్యార్థి దశ నుంచే... 25
రామాయపట్నం, వెలిగొండల్ని వేగంగా ......... 27
ఏటా రూ.500 కోట్ల మార్కెట్ సెస్సు ............. 28
ఎన్నికల కోసం రాష్ట్ర ప్రయోజనాలను ............ 30
సతీష్ చందర్‌కి పతంజలి పురస్కారం............ 31
మీడియాలో 'కీ' కామెంట్లు.......................... 32
క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టంపై ఏపీ............. 34

## సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ప్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311816**

విడి ప్రతి : రు. 10 ,
ఏడాది చందా : రు. 200
మూడేళ్ళ చందా : రు. 500

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836, **SBI** పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

IFSC No: SBIN0020072

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి

# 'రాష్ట్ర ప్రయోజనాలు - దేశ ఐక్యత - ఫెడరలిజం' లక్ష్యంగా..



ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సహా విభజన హామీలులో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దే ప్రయత్నం చేయకుండా రాజకీయ పార్టీలు మళ్లీ ప్రజల్ని రెచ్చగొట్టి మోసపూరితంగా ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నాయని, లోక్‌సత్తా మళ్లీ ఎన్నికల రాజకీయంలోకి అడుగుపెట్టి ఓటును నిజాల చుట్టూ మలిచే ప్రయత్నం చేయాలని వివిధ రంగాలకు చెందిన పలువురు విజ్ఞులు, యువత ఇటీవల కోరుతున్నారు. కనీసం 10-15శాతం ఓట్లు లేకుండా, నిజాయతీతో సంపాదించిన సొంత డబ్బును ఖర్చు చేయండి అంటూ యువత, ఇతర పౌరుల జీవితాల్ని ఫణంగా పెట్టి ఎన్నికల్లోకి వెళ్లటం తగదని నా నిశ్చితాభిప్రాయం. అలాగని లోక్‌సత్తా ఏమీ చేతులు ముడుచుకుని కూర్చోలేదు. ఏపీకి ప్రత్యేక హోదాతోపాటు తెలుగువారికి, దేశానికి సంబంధించిన పలు ప్రధానాంశాలపై సకాలంలో, సరైన పరిష్కారాలతో స్పందిస్తూ నిజమైన రాజకీయం చేస్తున్నది లోక్‌సత్తా మాత్రమేనని ధీమాగా చెప్పగలం. రాష్ట్ర విభజన సమయంలో, విభజన జరిగి కొత్త ప్రభుత్వాలు ఏర్పడ్డాక కూడా.. లోక్‌సత్తా చాలా ప్రాక్టికల్‌గా పరిష్కారాల్ని ప్రజలు, ప్రభుత్వాల ముందు ఉంచుతూ వస్తోంది. విభజన జరిగే సమయంలో ప్రధాన పార్టీలుగా పేరొందినవి పలాయనం చిత్తగించినా, లోక్‌సత్తాయే ప్రత్యేక హోదా సహా వివిధ పరిష్కారాలతో పరిశేష ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాల్ని పరిరక్షించే ప్రయత్నం చేసింది. ప్రణాళికా సంఘం ఉండగానే హోదా రాయితీల్ని సాధించుకోవాలని, పోలవరాన్ని వెంటనే ప్రారంభించాలని 2015 నుంచీ కార్యక్రమాల్ని నిర్వహించింది. ఏపీకిచ్చిన విభజన హామీలపై కేంద్రం నుంచి రావాల్సిన నిధుల నిగ్గుతేల్చేందుకు ఇటీవల కూడా ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) ఆధ్వర్యంలో 'స్వతంత్ర నిపుణుల బృందం' (ఐజీఈ)ని ఏర్పాటు చేశాం. అంతకుముందు పవన్ కళ్యాణ్ చొరవతో ఏర్పాటు చేసిన జేఎఫ్‌సీ (సంయుక్త నిజనిర్ధారణ సంఘం)లో సైతం లోక్‌సత్తా ప్రధాన పాత్ర పోషించింది. జేఎఫ్‌సీ కృషికి అప్‌డేట్‌గా, కొనసాగింపుగా ఐజీఈని చూడవచ్చు. "మౌనప్రేక్షకుల్లా చెడును సహించవద్దు, చెడుకు బలికావద్దు, పౌరసత్వమే ఆయుధంగా మార్పు కోసం పోరాడండి" అని నిరంతరం ప్రజలకు తాను చెబుతున్న మాటల్నే.. ఇప్పుడు ఐజీఈ ద్వారా కూడా లోక్‌సత్తా ఆచరించి చూపుతోంది. ప్రభుత్వాల్లో పనిచేసిన అపార అనుభవజ్ఞులు, న్యాయరంగంలోనూ మచ్చలేని సేవలందించినవారు.. ఐజీఈలో ఉన్నారు. ఏ అధికారం లేకపోయినా, పౌరసత్వం, విశ్వసనీయతలే పెట్టుబడిగా ఐజీఈ సమస్య సమగ్ర పరిష్కారానికి కృషి చేస్తోంది. ఐజీఈ సమావేశాలు, చర్చల్లో చాలా అంశాల్లో స్పష్టత వచ్చింది. విభజన హామీలంటే, చట్టంలో చేర్చినవి, ప్రధానమంత్రి ఆ సమయంలో పార్లమెంటులో ప్రకటించినవీ! కేంద్రం ఉదాసీనత, రాష్ట్రంలో సమన్వయ లోపం వల్ల ఇవి జటిలమయ్యాయి. కానీ తప్పులెన్నుతూ కూర్చోవటం వల్ల ఇప్పుడు లాభం లేదు కాబట్టి.. రాష్ట్రానికి రావాల్సిన అన్ని రకాల ప్రయోజనాలపై లోతైన చర్చ చేసి, నిష్పాక్షికంగా నిగ్గుతేల్చేందుకు, ఆ గణాంకాలు, హేతుబద్ధ వాదనలతో కేంద్ర ప్రభుత్వంతో కూర్చుని సాధించేందుకు ప్రయత్నాల్ని చేస్తున్నాం. హైదరాబాద్ ఆదాయాన్ని కోల్పోయే ఏపీకి ప్రత్యేకహోదా ప్రతిపాదనను నేను చేసినప్పుడు అందులో నాలుగు అంశాలున్నాయి. 1) రాష్ట్రానికి రెవెన్యూలోటు పూడ్చటం 2) వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక సాయం 3) కేంద్ర పథకాల్లో రాష్ట్రం మీద భారం లేకుండా 90 శాతం కేంద్రమే భరించడం 4) పరిశ్రమలకు పన్ను రాయితీల్ని ఇవ్వడం! 14 ఆర్థికసంఘం వచ్చాక రాష్ట్రాల రెవెన్యూలోటును కేంద్రమే పూడ్చటం, రాయలసీమ, ఉత్తరాంధ్రకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీకి హామీ ఇవ్వటం, పన్ను రాయితీలపై ఇతర రాష్ట్రాల అభ్యంతరాల నేపథ్యంలో.. హోదాలోని అంశాల్ని విడగొట్టి (డీ-కన్‌స్ట్రక్ట్) పరిష్కరించటం అవసరం. రెవెన్యూలోటు విషయంలో ఆర్థికసంఘం రాకముందు ఎంత ఇవ్వాలన్నదానిపై వివాదమున్నా.. కేంద్రం ఇచ్చిన, ఇస్తానని చెప్పిన రూ.4,100 కోట్లయితే మాత్రం సరైన అంకె కాదు. ఏపీకి కనిష్టంగా రూ.13,000 కోట్లను కేంద్రం భర్తీ చేయాలన్నది నిపుణుల ఏకాభిప్రాయం. విభజన జరిగాక పరిశేష ఆంధ్రప్రదేశ్‌కి 'రెవెన్యూ లోటు'ను కాకుండా 'వనరుల లోటు'ను భర్తీ చేస్తామనే మాటను కేంద్ర ప్రభుత్వం వాడిందని మర్చిపోకూడదు. అలాగే బుందేల్‌ఖండ్ తరహాలో లెక్కేస్తే.. సీమ, ఉత్తరాంధ్రకు రూ.33,000 కోట్లు రావాల్సుంటుంది. వచ్చింది మాత్రం కేవలం రూ. 2000 కోట్ల లోపు. హోదాకు సంబంధించిన మొదటి మూడు అంశాల్లో ఇతర రాష్ట్రాలకు ఏమీ అభ్యంతరాలు ఉండవు కానీ.. పారిశ్రామిక పన్ను రాయితీల వద్ద మాత్రం అడ్డుకునే ప్రయత్నం చేస్తాయి. ఈ అంశాన్ని కేంద్రంతో కూర్చుని ఒక క్రమపద్ధతిలో ఈ రాయితీల్ని సాధించుకోవాల్సి ఉంటుంది. ప్రత్యేక హోదా మంత్రమేమీ కాదు. ఆ పేరును వాడటం ఇబ్బంది అనుకుంటే, వేరే రూపంలో ఆ సాయాన్ని అందించవచ్చు. ఆర్థికపరంగా లెక్కేస్తే హోదా ద్వారా రాష్ట్రానికి వచ్చే డబ్బు ఎంత ఉంటుందో తేల్చేపనిని ఆర్థిక నిపుణులు చేస్తున్నారు. అలాగే కేంద్ర చట్టం సరిగా లేకపోవటం వల్ల పన్ను చెల్లింపుల్లో ఏపీకి జరుగుతున్న నష్టం, పోలవరం వంటి అంశాలపైనా నిపుణులు, కమిటీ అధ్యయనం సాగుతోంది. ఇతర రాష్ట్రాలు కూడా వేలెత్తిచూపలేని రీతిలో, న్యాయమని భావించేరీతిలో మన పరిష్కారాలు ఉండాలని ఐజీఈ భావిస్తోంది. దశాబ్దాలుగా ఎన్నికైనవాళ్లను, ప్రస్తుత పాలకులను వదిలేసి అన్నీ ఓ పౌరబృందమే చేసేస్తుందనుకోవటం భ్రమ. స్వతంత్ర నిపుణుల బృందం తనకు చేతనైనంత పూర్తిస్థాయిలో కృషి చేస్తుంది. కొన్ని వారాల్లోనే నివేదికను రూపొందించి కేంద్రంతో కూర్చుని ఏపీకి న్యాయంగా రావాల్సిన వాటాను సాధించేందుకు మా వంతు ప్రయత్నం చేస్తాం. ఇది దేవుడి పెళ్లి. విమర్శల్ని ఎన్నికలకాలానికి పరిమితం చేసి.. అందరూ పార్టీలకతీతంగా కలిసిరావాలి. మనం చిత్తశుద్ధితో, హేతుబద్ధంగా, ప్రజాస్వామికంగా వ్యవహరించగలిగితే అధికారంలో ఎవరున్నా తోసిపుచ్చలేరని లోక్‌సత్తా అనుభవాలు రుజువు చేస్తున్నాయి. ఆంధ్రులకు రెండు రకాల విశ్లేషణల్ని ఉపయోగిస్తుంటారు. ఒకటి ఆరంభశూరులు, రెండవది ఆవేశపరులు. రెండూ ఇక్కడ పనికిరావు. రాష్ట్ర ప్రయోజనాలు, దేశ ఐక్యత రెండు కళ్లుగా మన పోరాటాలు ఉండాలి, ఫెడరలిజం విస్తరణ దిశగా ఇది విస్తరించాలి. పార్టీల గొడవని ఓటు వేసేటప్పుడు చూసుకుందాం.

# మా సిద్ధాంతంలో విప్పి చెప్పాల్సినంత మిస్టరీ ఏమీ లేదు: మార్క్స్

## (2018- కార్ల్ మార్క్స్ ద్వి శతజయంతి సంవత్సరం)

కార్ల్ మార్క్స్.. 19వ శతాబ్దపు ముగ్గురు మహాతత్వవేత్తల్లో ఒకరుగా ఖ్యాతి గడించారు. తత్వశాస్త్రాన్ని పునర్నిర్వచించి రాజకీయ సామాజిక రంగాల్లో మార్క్స్ వెలువరించిన సైద్ధాంతిక ఆలోచనలు 21వ శతాబ్దంలోనూ ఏదోకచోట ఏదోకరూపంలో ప్రభావం చూపుతున్నాయి. 1840లలో వార్తాపత్రిక ఎడిటర్‌గా కెరీర్‌ను ప్రారంభించిన మార్క్స్.. రాజకీయ కారణాల వల్ల ఆ పత్రికను మూసేశారు. తర్వాత ప్యారిస్‌లో కూడా అదే పరిస్థితి. చివరికి లండన్‌లో ఒక ఇల్లు సంపాదించుకుని కుదురుగా ఉండగలిగారు. ఆ కాలంలోనే ఆయన విఖ్యాత తాత్విక, రాజకీయార్థిక రచనలు వెలువడ్డాయి. 1851 నుంచి 1862 వరకు ఆయన 'న్యూయార్క్ ట్రిబ్యూన్'కు విదేశీ విలేకరిగా ఉన్నారు. ఆయన విశిష్ట రచన 'డాస్ క్యాపిటల్' 1867లో ప్రచురితమైంది.

2018- మార్క్స్ ద్వి శతజయంతి సంవత్సరం. ఈ నేపథ్యంలో.. అప్పట్లో మార్క్స్ ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలోని కొన్ని అంశాలను లోక్‌సత్తా టైమ్స్ పాఠకులకు అందిస్తున్నాం. కమ్యూనిస్టు సిద్ధాంతం, శ్రామికవర్గం, మతం, మధ్యతరగతి భాగస్వామ్యం, ప్రజలు అసోసియేషన్లు (సంఘాలు)గా ఏర్పడటం.. తదితర కీలకమైన విషయాలను ఆయన ఇందులో ప్రస్తావించారు.

మార్క్స్‌తో ఈ ఇంటర్వ్యూను న్యూయార్క్ వరల్డ్ పత్రిక విలేకరి ఆర్.లాండర్ జులై 3, 1871న రికార్డు చేశారు. ఇంటర్వ్యూ సమయంలో మార్క్స్ పక్కన ఏంగెల్స్ కూడా ఉన్నారు. ఈ ఇంటర్వ్యూకు రెండు నెలల ముందు మార్క్స్ కీలకపాత్ర వహించిన ప్యారిస్ కమ్యూన్ రక్తసిక్తంగా అణచివేయబడింది.

**కార్ల్ మార్క్స్‌తో ఆర్. లాండర్ ఇంటర్వ్యూలోని కొన్ని అంశాలు..**



**(?) డాక్టర్ మార్క్స్! లండన్ కేంద్రంగా మీరు నడుపుతున్న ఇంటర్నేషనల్ అసోసియేషన్ పట్ల చాలామంది ద్వేషభావంతో ఉన్నట్టు కనిపిస్తోంది. కానీ తాము ద్వేషిస్తున్నదేమిటో మాత్రం వాళ్లు స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. మీ సిద్ధాంతంలోని ఈ మిస్టరీని విప్పుతారా?**

మార్క్స్: ఇందులో విప్పి చెప్పాల్సినంత మిస్టరీ ఏమీ లేదు సర్! అయితేగియితే ఆ మిస్టరీ మానవ స్టుపిడిటీయే. మా అసోసియేషన్ కార్యకలాపాలు బహిరంగమైనవి. మా కార్యక్రమాలు ఎప్పటికప్పుడు ప్రచురితమవుతుంటాయి. ఒక పెన్నీ పెడితే నిబంధనలు కొనుక్కోవచ్చు. ఒక షిల్లింగ్ పెడితే కరపత్రాలు కొనుక్కోవచ్చు. అవి చదివితే మా గురించి మాకు తెలిసినంత మీక్కూడా తెలుస్తుంది.

**(?) ప్యారిస్ కమ్యూన్‌కు లండన్ నుంచి రహస్య ఆదేశాలు వచ్చాయని ప్రజలు అనుకుంటున్నారు. లండన్ నుంచి నిధులు కూడా వచ్చాయని భావిస్తున్నారు.**

ఏదో రోమన్ క్యాథలిక్ కేంద్రం నుంచి విశ్వాస, నైతిక నిబంధనావళి జారీ అయినట్టు లండన్ నుంచి రహస్య ఆదేశాలు జారీ అయ్యాయనుకోవటం పొరపాటు అభిప్రాయం. మా ఇంటర్నేషనల్ స్వభావం పట్ల సరైన అవగాహన లేకపోవడమే ఈ అపోహలకు కారణం. కేంద్రీకృత విధానాలకు ఇంటర్నేషనల్ పూర్తి విరుద్ధం. స్థానిక నిర్మాణాలు స్వేచ్ఛగా తమ సామర్థ్యాలను వ్యక్తీకరించే విధంగానే ఇంటర్నేషనల్ పనితీరు ఉంటుంది. నిజానికి ఇంటర్నేషనల్ శ్రామికవర్గ ప్రభుత్వం కానే కాదు. ఒక నియంత్రణాశక్తీ కాదు. ఇది కేవలం యూనియన్‌గా ఉంచే ఒక బంధం.

**(?) ఏ లక్ష్య దిశగా ఈ యూనియన్**

రాజకీయాధికార సముపార్జన ద్వారా శ్రామికవర్గ ఆర్థిక విముక్తిని సాధించటం, సాంఘిక ప్రయోజనాల కోసం రాజకీయ అధికారాన్ని వినియోగించటం.. ఈ క్రమంలో శ్రామికవర్గ కార్యకలాపాలన్నీ కలిసొచ్చే విధంగా మా లక్ష్యాలు సమగ్రంగా ఉంటాయి. అయితే శ్రామికుల మధ్య సమీకరణలు ఆయా ప్రాంతాల కనుగుణంగా మారొచ్చు. అవి ఎవరికి వారుగా నిర్ణయించుకుని తమకనువైన కార్యాచరణను రూపొందించుకోవచ్చు.

**(?) మాజినీ కూడా మీలో సభ్యుడా**

(నవ్వుతూ) ఓహ్, లేదు. అతని ఆలోచనల స్థాయిని దాటకపోతే చాలా వెనుకబడి వుండేవాళ్లం. మధ్యతరగతి రిపబ్లిక్ ఆలోచనలు అతనివి. మధ్యతరగతి భాగస్వామ్యాన్ని మేమాశించటం లేదు.

**(?) మతానికి సంబంధించి**

ఆ విషయానికి సంబంధించి సంఘపరంగా నేను మాట్లాడలేను. నా వరకూ నేను నాస్తికుడ్ని. ఈ విషయాన్ని ఇంత స్వేచ్ఛగా చెప్పటం ఇంగ్లాండ్‌లో సాహసమే. అదే జర్మనీ, ఫ్రాన్స్‌లలో ఈ విషయాన్ని గుసగుసలుగా మాట్లాడుకోవాల్సిన పన్లేదు.

**(?) అయినా మీరు మీ ప్రధాన కేంద్రాన్ని ఇంగ్లాండ్‌లోనే ఏర్పాటు చేసుకున్నారు**

దానికి స్పష్టమైన కారణాలున్నాయి. అసోసియేషన్ హక్కు ఇక్కడ గుర్తింపు పొందింది. జర్మనీలో కూడా ఈ అవకాశం ఉందిగానీ.. అనేక అవరోధాలు ఎదుర్కోవాలి. ఫ్రాన్స్‌లో చాలాకాలం అసోసియేషన్ హక్కనే మాటే లేదు. ❍

# అలాంటివాళ్లని పార్లమెంటుకు పంపడం దండగ



**భా**రతదేశానికి అత్యున్నత దేవాలయం లాంటి పార్లమెంటులో ప్రజల సమస్యలపై చర్చలు చేయలేని దుస్థితి నెలకొనటం విషాదకరమని బాబ్జీ అన్నారు. రాజ్యాంగ దేవాలయం లోకి దెయ్యాలు ప్రవేశించాయన్న అంబేద్కర్ భయాన్ని నిజం చేసేలా సభ్యులు, పాలకపక్ష నేతలు బడ్జెట్ సమావేశాల్లో వ్యవహరించారన్నారు. చట్టసభలను సద్వినియోగం చేయటం తెలియని వాళ్లని సభకు పంపటం దండుగన్నారు. సమర్థులు, నిజాయతీ పరులు ఎన్నికయ్యేలా చూడటం రాజకీయ పార్టీల, ఎన్నికల వ్యవస్థ ప్రధాన లక్ష్యమని, దాన్ని నెరవేర్చటం కోసం సంస్కరణల్ని చేసుకోకపోతే భారత ప్రజాస్వామ్యం మున్ముందు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కోవలసి ఉంటుందని హెచ్చరించారు. విభజన నేపథ్యంలో ఏపీ ప్రయోజనాలు, ప్రజల పట్ల బీజేపీ, తెలుగుదేశం ప్రభుత్వాలు అనుసరిస్తున్న తీరుకు, పార్లమెంటును దిగజార్చటానికి నిరసనగా జోతిబాపూలే విగ్రహం వద్ద లోక్‌సత్తా నేతలు నిరసన వ్యక్తం చేశారు. 'ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు' అని నినాదాలు చేశారు. లోక్‌సత్తా పార్టీ నాయకులు తాతారాజు రాజారావు, పిళ్లా ఆదీశ్వరరావు, కె.ఎ రావు, ఉమా, చంద్రమోహన్, వెంకటేష్, రమేష్, అప్పారావు, శివ, కృష్ణ, సతీష్, ప్రకాష్, నాయుడు, రమణ, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు. ❍

# బహుముఖ కార్యాచరణే ప్రత్యామ్నాయం

- సాధు సుబ్రహ్మణ్యం శర్మ




సోవియెట్ యూనియన్ పతనం గురించి ఆసక్తికరమైన వివాదాన్ని రంగనాయకమ్మగారు ఈమధ్య ప్రారంభించినారు. మంచిదే. అందులో వారు ప్రస్తుత వామపక్ష భావజాలంలోని పునాదులనూ ప్రశ్నించారు. అదీ అవసరమే. ప్రపంచ రాజకీయాలపై సోవియెట్ విప్లవం నాడు ఎంత ప్రభావం చూపిందో, దాని పతనమూ నేటికీ అంతటి ప్రభావం కల్గి ఉంటూంది.

ఆ పతన కారణాలను విశ్లేషిస్తూ చాలా సాహిత్యమే వెలువడి ఉండవచ్చు. కానీ లోతైన తాత్విక ప్రాతిపదికన నిష్కర్షగా కొంతకాలం నిలువగలిగిన తుదిమాట నాబోటి సామాన్యుని వరకు దిగిరాలేదు. పైస్థాయిలోనైనా అట్టిది జరిగిందో లేదో తెలియదు. జరిగేవుంటే అది ఈనాటికీ గోప్యంగా ఉండనవసరం లేదు. ఆమాటకొస్తే అది అందరికీ తెలిస్తేనే వృద్ధి.

పోతే, అట్టి తుదిమాట గాని తత్వశాస్త్ర చర్చగాని రాజ్యాధికారం కోసం ఉద్యమాల్లో, 'పోరాటాల్లో' తలమునకలై మునిగిన సామాన్య నాయకశ్రేణి నుంచి ఆశించలేము. అలా చూడగల నాయకులే ఉంటే సోవియెట్ యూనియన్ పతనమే చెంది ఉండదు. సామాన్య నాయకుల కాలమంతా అధికారగణ ప్రత్యర్థి భావజాలానికి, ప్రచారానికి, ఎత్తుగడలకు, దాడులకు దీటైన జవాబు ఇవ్వడంలోనే ఖర్చవుతూ ఉంటుంది. "ఫుల్లీ ఎంగేజ్డ్ ఇన్ అర్జంట్ ఎఫైర్స్ బట్ నో టైమ్ ఫర్ ఇంపార్టెంట్ ఎఫైర్స్" అన్నది చలామణిలో ఉన్న ఒక మేనేజ్‌మెంట్ జోకు, సూక్తి (Fully engaged in urgent affairs, but no time for important affairs).

కీలక ప్రజాఉద్యమాల్లో అగ్రశ్రేణి ఉన్నతులతో ఒక మాదిరి అతిసన్నిహితమూ, అతిదూరమూకాని నమ్మకమైన సంబంధాలున్న మేధావుల్లో, గొప్ప విద్యావంతులైన విశ్రాంత అగ్రశ్రేణి నాయకుల్లో ఆ పని చేయగల్గాలి. అది బహుకష్టంతో కూడుకున్న పని. నిరపేక్షత, నిష్పాక్షికత, కేవల సత్యాన్వేషణపరత, త్యాగబుద్ధి వంటి అనేక సుగుణరాశితో సెంటిమెంట్లకు అతీతంగా జరుగువలసిన కృషి అది.

అంతేకాదు, ఒక్కొక్కప్పుడు, చరిత్ర గొప్ప మలుపు తిరగవలసిన చౌరాస్తాలో స్తంభించినప్పుడు, అడ్డగోలుగా మన ఎదుట నిలిచిన సమస్యలతో ఏమాత్రం ప్రత్యక్ష సంబంధం కన్పించని అనూహ్యమైన ప్రాతిపదిక మీద పరిష్కారం దొరకవలసి ఉంటుంది. ఎద్దుబండ్లు, గుర్రపు కోచులు, విపరీత సంఖ్యకు పెరిగిపోయి వాటి సంకుచిత పరిధిలో రవాణా వ్యవస్థను ముందుకు తీసుకుపోవడం అసంభవమైనప్పుడు పరిష్కారం రైలింజన్, ఇంధన చమురు బండ్లలో దొరుకుతుంది. అందుకవసరమైన సృజనాత్మకతను ప్రకృతి మనకు ప్రసాదించి ఉంది. దాని ఉపయోగంలోనే మానవజాతి నేటి స్థాయినందుకొన్నది. అందులోని ఒడిదుడుకులను, కష్టనష్టాలను విజయవంతంగా ఎదుర్కొని దాటుకుంటూ వస్తూన్నది.

ఈ విధమైన పరిష్కారం దొరికేందుకు సమాజమంతటా, ముఖ్యంగా కష్టజీవుల్లోను వారికంటే ఒక మెట్టు పైనున్నవారిలోను సృజనాత్మక స్వభావం వెల్లివిరుస్తూ ఉండాలి. కొత్త దారులు తొక్కగల ధైర్యసాహసాలు, అందులో వైఫల్యాలకు నీరసించక తిరిగి మొదటి నుంచి పైకెక్కేందుకు పూనుకోగల ఉద్యమశీలత, అట్టివారికి ప్రోద్బల మివ్వకపోతే మానె, కనీసం

సహించి గౌరవంగా చూసే ఉదారనీతి వంటి సుగుణాల విత్తనాలు అక్కడక్కడా నైనా మొలకెత్తి ఉండాలి. అప్పుడే తీవ్రమైన సామాజిక వైరుధ్యాల నుండి విప్లవాత్మకమైన కొత్త మిణుగురులు విరివిగా బయలు దేరుతాయి. వాటిలో ఒక్కటి అంటుకుంటేచాలు మంటలు మండ నారంభిస్తాయి. క్రమంగా ఆ మంటలు దావానలమౌతాయి. ఉన్నత స్వభావం అసంఖ్యాకుల్లో పెంపొందించ గల అటువంటి సంస్కరణోద్యమం కావాలి నేడు.

అస్తమానం సమాజం కుళ్లి పోయిందంటూ ఎత్తిచూపినంత మాత్రం చేత– వర్తమానం మీద గుడ్డి వ్యతిరేకత రెచ్చగొడుతూ కూర్చుంటే సరిపోదు. దాని నివృత్తికి సామాన్యుడు తన పరిధిలో ఏం చేయగలడో, ఏ సుగుణాలను అలవర్చు కొనగలడో, ఎట్టి నడవడితో వ్యవహరిస్తూ భావిలో గొప్ప విప్లవానికి నేపథ్యంగా ఉండగలడో కూడా చెప్పాలి, నేర్పాలి. నేటి ఆత్మహత్యలకంటే మెరుగైన ప్రత్యామ్నాయం మొకటుందని సామాన్యునికి కన్పించాలి. కొత్త సమాజంలో ఉండవలసిన విలువలు, కొత్త ఆదర్శాలు, అను సరణీయ రోల్‌మోడల్స్ కన్పించాలి. ప్రతి వ్యక్తీ తుపాకులకెదురొడ్డి నిలబడేంత సీను సామాన్య పరిస్థితుల్లో ఉండదు. కానీ ప్రతి వ్యక్తీ ఇంతకంటే మేలైన సమాజానికి పునాదిగా మాత్రం ఉపయోగపడగలడు. అప్పుడే విజయం సాధ్యమౌతుంది. స్వాతంత్ర్యానికై పోరాడిన రోజుల్లో నాయకత్వం వహించినవారు ప్రజల్లో అభిమానశీలతను, త్యాగ శీలతను, పోరాట పటిమను ఆదర్శాలుగా ప్రోత్సహించారు. అందుకైన అన్ని దారులను పూర్తిగా వినియోగించు కొన్నారు. నాటికి వారికది అవసరం.

నేటి పరిపాలకుల అవసరాలు దానికి పూర్తిగా వ్యతిరేకం. నేటికి ఇంకా బలవంతులుగానే ఉన్న అంతర్జాతీయ స్థాయి పెట్టుబడిదారులతో మనవారికి సంబంధాలు బాగా చిక్కనై ఉన్నాయి. ఇక్కడ వ్యవసాయం, పరిశ్రమలు, మైనింగ్, ఆయుధాల వ్యాపారాలు, ఉద్యోగాలు వంటి రంగాలలో వారితో ఒక మాదిరి అవగాహన కుదిరి, భాగస్వామ్యం, వంపకాలు ఒకస్థాయి డైనమిక్ ఈక్విలిబ్రియం చేరుకొని ఉన్నాయి. కానీ అవి శాశ్వతంగా నిల్చి ఉండేవి కావు. ఆ నిలకడ ఉండీ లేని స్థితిలో ఉత్పన్నమయ్యే వైరుధ్యాలను తమకనుకూలంగా మలచుకొని గొప్పగా ఎదిగిపోగలమన్న ధీమాతో నేటి పాలకులు వ్యవహరిస్తున్నారు. అది సహేతుకమో, భ్రమయో ముందు జరగబోయే చరిత్రే తేలుస్తుంది. ఇప్పటికి వారు ఆ ధీమా నిషాలో తమ పెరుగుదలకు అడ్డుపడని సమాజాన్ని నిర్మించుకోవాలని తెగ ఉబలాటపడిపోతున్నారు. దానికి భిన్నంగా ఉండే ఏ చిన్న విషయాన్నీ ఏ మాత్రమూ సహించేపాటి స్థయిర్యమూ వారిలో లేదు. అగాధపుటంచున నించున్నవాని భీతిని పోలి ఉంది వారి భయం. అది వారిలో లేని తెగువను పుట్టిస్తోంది. వారి పాలనలో సామాన్యుడు ప్రశ్నించడం, ఆలోచించడం సహించరాని అపచారాలైపోతున్నాయి. జరిగే అన్యాయాలను, సహజంగా జరిగేవిగా, వాటికి పరిష్కారం దైవమే చూపదలచినట్టుగా ప్రబోధాలు విరివిగా ఉంటున్నాయి. "భక్తి" ప్రబోధాలతో, మూలపడిన ఆచారాలను పునరుద్ధరి స్తున్నారు. సమాజంలో ఒకరి బాగుకు మరొకరు ఆటంకమని చూపుతూ, విభజించి పాలించే దుర్నీతి పరాకాష్ఠకు చేరుతున్నది. ఎదిగే అవకాశాలు జారిపోతాయేమోనన్న భయంలో వారేం చేస్తున్నారో వారికి తెలియటం లేదు. సర్వమూ వ్యాపారమయం. సిరి సంపాదనలో ఏ నియమమూ పాటించనక్కర్లేని ఒక విశృంఖల పోటీల రేసు. ఇవన్నీ ఒక వేళ కొత్తగా పుట్టుకొచ్చినవేం కావు. నాగరికత పుట్టిన నాటి నుంచి వస్తున్నవే. ఇవి ఉధృతమైన ఒక దశకు చేరుకొన్నాం, అంతే.

ఈ దుష్కర పరిస్థితుల నుంచి సమాజాన్ని ఉద్ధరించబూనినవారు "నువ్వంటే నువ్వ"ని పరస్పరారోపణలు చేసుకోవడం వల్ల ప్రయోజనం లేదు. అభ్యుదయం కోరే వారందరిదీ పాలకుల నుంచి అధికారం లాక్కునే ఏకాగ్రదృష్టి కావడం నేటి చారిత్రక అవసరం. మిగిలినవన్నీ మన దృష్టిపథం నుంచి తొలగిపోవాలి. పరస్పర సహకారాలు, ఇచ్చిపుచ్చుకోవడాలు పెరగాలి. దానికైన ఏ ఒక్కదారీ వదులుకోకూడదు. ఏ దారి వదులుకున్నా అది "చారిత్రక తప్పిదం" అవుతుంది.

సమాజం దాని వ్యవస్థలు పుట్టిపెరిగి కొనసాగే క్రమంలో మనిషి నిరంతరం అనేకానేక వైరుధ్యాలతో సతమతమవు తుంటాడు. వాటిలో ఒక్కటే, ఒక్కటంటే ఒక్కటే ప్రధానమూ కీలకమూ అయి ఉంటుంది. దాన్ని గుర్తించి, విడిగా చూసి, క్షుణ్ణంగా అర్థం చేసుకొని, పరిష్కరించుటకు సర్వశక్తులూ ఒడ్డి పోరాడే స్ఫూర్తిని, తెగువను సామాన్యుల్లో కలగజేయాలి. అట్టి చైతన్యాన్ని స్ఫూర్తిని శక్తిని వారికివ్వగల్గిన నేర్పరులు– మేధావులు, రచయితలు, ఇతర కళాకారులు, వివిధ పార్టీల సంస్థల

స్వార్థరహిత కార్యకర్తలు మాత్రమే. వారి ప్రభావంలో ఉద్యమించిన జాతి తన కనుగుణమైన నాయకులనూ సృష్టించుకొంటుంది.

మన ఈ విశ్వం, అందులో భూగోళం, దానిపై జీవజాలం, అందులో మానవ సమాజాలు, వాటి చరిత్రలు బహు విశాలమైనవి, క్లిష్టమైనవి. ఏ ఒక్క సిద్ధాంతమూ, అది ఎంత గొప్పదైనా, వాటిని పరిపూర్ణంగా ఇముడ్చుకుని ఎల్లకాలం విశదీకరించజాలదు. ప్రగతి ప్రవాహం ఆగదు. కొత్త నీళ్లు రాకమానవు. పాత సూత్రీకరణల ఆధారంగా కొత్త సూత్రాలు, పాత 'సత్యా'ల ఆధారంగా కొత్త 'సత్యా'లను ఆవిష్కరింపజేసుకొంటూనే మానవులు అభివృద్ధి చెందుతూ వచ్చారు. చరిత్ర ఎప్పుడూ దృశ్యాదృశ్యమే. పర్వతారోహకులకు తామెక్కివచ్చిన దారి ఒక్కొక్క లెవెల్లో ఒక్కొక్క రీతిగా కన్పించినట్టుగా ఉంటుంది చరిత్ర. ప్రస్తుతానికి, భావికీ తోడ్పడే వరకే మనం చరిత్రను, గతాన్ని ఉపయోగించుకోవాలి. అదియే గతానికి చరిత్రకి తగిన నివాళి.

నేటి గొప్ప సాంకేతిక అభివృద్ధికీ, దానిపై సామ్రాజ్య వాదులకు ఏర్పడి ఉన్న పట్టుకు అబ్బురపడిపోయి, వారి వెంట పరుగులు పెట్టడంలో మనకు చరితార్థత దక్కదు. వ్యవసాయ విప్లవపు చరమదశలో పారిశ్రామిక విప్లవం పుట్టి పెరగడం మొదలైంది. ఆ పుట్టుక కోసం ఎన్ని శతాబ్దాలపాటు పునాది రాళ్లనొక్కటొక్కటిగా పేర్చుకుంటూ వచ్చింది మానవజాతి! ఎన్ని తరాల కృషి తెగువతో కూడిన సత్యాన్వేషణ, రక్తతర్పణం, రాపాడితే ఆ ఒక్క మిణుగురు ఇంగ్లాండులో పుట్టింది! అది ఎన్ని దశలు దాటి, ఎన్ని ఘోరాలు తట్టుకొని నేటి గ్లోబల్ స్థితికి చేరుకొన్నది! ఈ గ్లోబల్ స్థితి స్థిరపడి అభివృద్ధి చెందేందుకు ఇంకా ఎన్ని ఘోరాలు జరగవలసి ఉన్నాయో! అట్టి ఘోరాలను వీలైనంత తక్కువ నష్టంతో దాటిపోగల మార్గాలను వెతుక్కొని, ఉద్యమించగల ప్రయత్నంలోనే పండుతుంది, నేటి మనిషికి చరితార్థత.

ప్రవాహంలో కొట్టుకొనిపోయే రీతి 'పాత్ ఆఫ్ లీస్ట్ రెసిస్టెన్స్'ను అనుసరించి ఏవిధంగానైనా సరే బతికుంటే చాలుననుకుంటూ ఎంత నికృష్టస్థితికైనా కుంచించుకునిపోయి మనుగడ సాగించే స్వభావం మన ప్రజానీకానిది. దాన్ని మార్చి వ్యతిరేకధృవోన్ముఖులను చేసి, పరిస్థితులను స్వశక్తితో మార్చుటకు పునుకునేలా చేయడానికి ఎంత భగీరథ ప్రయత్నం కావాలి!

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో) ❍

# సిక్కు యువతకు ఉగ్రవాద శిక్షణ

**భా**రత్‌లో ఉగ్రవాద కార్యకలాపాలను ప్రేరేపిస్తూ.. సిక్కు యువతకు పాకిస్తాన్‌లోని ఐఎస్ఐ శిక్షణనిస్తున్నట్టు కేంద్ర హోంశాఖ పేర్కొంది. ఈ మేరకు మురళీమనోహర్ జోషి నేతృత్వంలోని పార్లమెంటు అంచనాల కమిటీకి హోంశాఖ కార్యదర్శి నేతృత్వంలోని బృందం నివేదిక సమర్పించింది. "కేంద్ర సాయుధ పోలీసు దళాలు, అంతర్గత భద్రత సవాళ్లు.. అంచనాలు, అనుక్రియ విధానాల"పై సమర్పించిన నివేదికలో పలు అంశాలను వివరించింది. "కెనడా, ఐరోపా, అమెరికాలో నివసిస్తున్న, స్థిరపడిన సిక్కులను తప్పుదోవ పట్టిస్తూ.. వారిని పాక్ ఐఎస్ఐ భారత్‌పైకి ఉసిగొల్పుతోంది. పంజాబ్‌లోనే కాకుండా, దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ కుట్రలకు పాక్‌కు చెందిన సిక్కు ఉగ్రవాద కమాండర్లపై ఒత్తిడి పెంచుతోంది" అని తన నివేదికలో వివరించింది.

# ఆసియా దేశాల కంటే కూడా వెనుకబడిన భారత్


**ప్ర**పంచ మేటి యూనివర్సిటీల జాబితాలో అమెరికా, బ్రిటన్‌లు సత్తా చాటాయి. టాప్ టెన్‌లో ఐదు అమెరికావి, నాలుగు బ్రిటన్‌వి. భారతీయ విద్యాసంస్థలు మంచి ర్యాంకులను ఈసారి కూడా ఒడిసిపట్టలేకపోయాయి. చాలా ఆసియా దేశాల విద్యాసంస్థల కంటే వెనుకబడ్డాయి. ప్రస్తుత ఏడాది (2018)కిగాను క్వాక్వారెల్లీ సైమండ్స్ (క్యూఎస్) సంస్థ ఈ జాబితాను విడుదల చేసింది. సబ్జెక్టులవారీగానూ ర్యాంకులు ప్రకటించింది. తొలి వంద యూనివర్సిటీల్లో చైనావి ఆరు ఉన్నాయి. జపాన్‌వి ఐదు ఉన్నాయి. భారత్ విద్యాసంస్థ ఒక్కటీ లేదు. మొదటి 200 విద్యాసంస్థల్లో మాత్రం మూడింటికి చోటు దక్కింది. ఆమధ్య విడుదలైన టైమ్స్ ప్రపంచ వర్సిటీల జాబితాలోనూ మన విద్యాసంస్థలకు మంచి ర్యాంకులు దక్కలేదు. ❍

# మార్క్సిజం విలువైనదే కానీ.. శాశ్వత సత్యం కాదు!

- కార్ల్ మార్క్స్‌కి 200 ఏళ్లు
- రష్యా బోల్షివిక్ తిరుగుబాటుకు శతవసంతాలు
- నక్సల్బరీకి ఐదు పదులు

... సందర్భంగా !

- డా॥ జయప్రకాష్ నారాయణ్




మార్క్స్, ఆ మాటకొస్తే ఎంత గొప్ప సిద్ధాంతకర్త చెప్పిందయినా శాశ్వత సత్యం అనుకోనక్కర్లేదు. ఏ సిద్ధాంతమైనా.. కాలపరీక్షను ఎదుర్కోవాల్సిందే, కాలానుగుణంగా మార్పులకు వెసులుబాటు ఇవ్వాల్సిందే! అలా కాలానికి తగ్గట్టుగా మారే సత్తా లేని సిద్ధాంతాలు అంతరించాల్సిందే.. ఈ కాలాతీత సత్యాన్ని గుర్తిస్తే మానవజాతి చరిత్రలో మార్క్సిజం వాస్తవ స్థానం మనకు తేటతెల్లమవుతుంది.

ఎప్పటికప్పుడు నూతన ఆవిష్కరణలతో మానవాళి సంపద నిరంతరం పెరుగుతుంటుందనేది నిరూపితమవుతున్న విషయం. అలా సాంకేతితతో తన కాలంలో చోటుచేసుకున్న అభివృద్ధిలో ఎదురైన సమస్యల్ని అధిగమించ డానికి కార్ల్ మార్క్స్ ఎంతో లోతైన అధ్యయనంతో కొన్ని ప్రతిపాదనల్ని చేశారు. అంతకుముందున్న తరం వారి భుజాల మీద నిలబడే అయినా.. మార్క్స్ చేసిన ప్రతిపాదనలు వినూత్నమైనవి, విస్తృతమైనవి. సమస్యల వర్ణనలకు పరిమితంకాకుండా, పైపైన కాకుండా.. ప్రపంచంలోని కోట్లాదిమంది పేదలకు అధ్యయనం, అవగాహన ద్వారా పరిష్కారాల్ని అందించటానికి ఆయన ప్రయత్నించారు. ఒక ఆదర్శాన్ని నెలకొల్పారు. మార్క్స్ అక్షరాలిచ్చిన స్ఫూర్తితోనే.. అందరికీ సమానత్వం దిశగా విద్య, ఆరోగ్యం అందించటాన్ని ప్రపంచంలోని అనేక దేశాల్లో పాలకులు 'సోషల్ కాంట్రాక్ట్' (పాలన) లో భాగం చేశాయి. అందరికీ కనీస సదుపాయాలు, ఎదిగే అవకాశాలుండే సోషలిజం సాధనకు రకరకాల ఏర్పాట్లను తమ బాధ్యతగా ప్రభుత్వాలు అంగీకరించాయి. దీనివల్ల మార్కెట్ పెరిగింది, మార్కెట్‌లో భాగస్వాములయ్యే శక్తి ప్రజలకు కూడా విస్తరించింది. సమాజాభివృద్ధికి, వ్యక్తి అభివృద్ధికి దోహదం చేసే పరిస్థితులు మరింతగా బలోపేతమయ్యాయి.

మార్క్స్ చెప్పిన చారిత్రక భౌతికవాదాన్నిగానీ, ఉత్పత్తి సాధనాల విశ్లేషణనుగానీ విభేదించేవారుండారు. స్థూలంగా అందరూ అంగీకరిస్తారు. అయితే సంపదసృష్టిని సంపద పోగుపడటంగా మార్క్స్ పొరపడ్డారు. దీన్ని వ్యవస్థీకృత దోపిడీగా చిత్రీకరించి వర్గపోరాటాలను సూత్రీకరించారు. వీటిని ఆధారంగా చేసుకునే సోషలిస్టు, కమ్యూనిస్టు దేశాల్లో పాలకులు, ప్రభుత్వాల

## రాజ్యవ్యవస్థ కూలిన మాట వాస్తవం.. కానీ తుపాకీ పరిష్కారం కాదు: జేపీ




సుమారు యాభై ఏళ్ల క్రితం 1967లో పశ్చిమ బెంగాల్‌లోని నక్సల్బరీ 'బరి'లోకి వచ్చింది.

దానిని బలోపేతం చేసేందుకు 1969, ఏప్రిల్ 22న, లెనిన్ జయంతి సందర్భంలో కలకత్తాలో కానూ సన్యాల్ భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు–లెనినిస్టు) పేరుతో విప్లవపార్టీ ఏర్పాటు చేశారు. చారు మజుందార్ దీనికి ప్రధాన కార్యదర్శి. వెంటనే ఆంధ్రప్రదేశ్‌లోనూ కమిటీ ఏర్పాటు చేశారు. ఏపీకి తొలి కార్యదర్శి పంచాది కృష్ణమూర్తి (ఈయన మనవడు లోక్‌సత్తా సభ్యులు).

పార్టీకి కొన్ని అతివాద సూత్రీకరణలు చారు మజుందార్ నుంచే వచ్చాయి. 'బహిరంగంగా ప్రజాసంఘాలు పెట్టి పనిచేయకూడదు. ప్రజలు ఏమాత్రం ఇష్టపడని వర్గశత్రువుని లేకుండా చేయాలి. ఇదంతా సాయుధ పోరాటం ద్వారానే సాగాలి'. అయితే 1970కల్లా ఈ పద్ధతి సరైంది కాదనే చర్చ పార్టీలో మొదలైంది. మే 1న కలకత్తాలో పార్టీ ప్రకటన అనంతరం మే 27న తిరిగి వస్తుండగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో పంచాది కృష్ణమూర్తి సహా ఆరుగురు ఏపీకి చెందిన నాయకత్వ ప్రతినిధులు మరణించారు. ఏపీలో ఇదే తొలి ఎన్‌కౌంటర్. దాంతో ప్రతీకారేచ్ఛ మొదలైంది. అలా మొదలైన దాడులు, ప్రతిదాడులతో నక్సలైట్లు, పోలీసుల మధ్య హోరాహోరీ పోరు సాగుతూనే ఉంది. అసలు నక్సలిజం మొదలై 50 సంవత్సరాలయినా, వారి లక్ష్యం ఎంతవరకు సఫలమైంది? వారు ఎంచుకున్న మార్గం ఎంతవరకు సబబు? ఈ ప్రశ్నలకు 'సోషల్‌పోస్ట్' ఇంటర్వ్యూలో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ చెప్పిన సమాధానం ఆయన మాటల్లోనే..

"రాజ్యవ్యవస్థ కూలిన మాట వాస్తవం. మన రాజకీయంలో దుర్మార్గం ఉన్న మాట వాస్తవం. దేశాన్ని కొంతమంది దోచుకుంటున్న మాట వాస్తవం. కానీ దానికి తుపాకీ పరిష్కారం అనుకుంటే సరికాదు. చివరికి అతిపెద్ద తుపాకీ గల రాజ్యం గెలుస్తుంది. సార్వభౌమాధికారం అంటే 'అందరికంటే ఎక్కువ అధికారమున్నది, తిరుగులేకుండా శాసనం చేసేది. అది ఎవరికుంటే వారు వారే గెలుస్తారు' అని కొంతమంది విప్లవకారులు చెబుతున్నారు. ఇప్పటికీ అదే కరెక్ట్ అనడం సరికాదు. 70, 80 ఏళ్లపాటు ప్రపంచమంతా ఈ సిద్ధాంతం నాశనమైపోయి, అన్ని దేశాల్లో అంతరించిపోయాక ఉత్తరకొరియాలోనూ మరికొన్ని చోట్ల ఉన్న ఈ సిద్ధాంతంతో విప్లవం సాధిస్తామని చెప్పడం హాస్యాస్పదం. పోలీసులు కూడా మనలాంటి వారే. వారిని మట్టుపెట్టడం ఎంతవరకు సబబు? ఈవేళ దారి తెలియకుండా, అర్థంపర్థం లేకుండా, దిశ తోచకుండా, తుపాకీ చేతిలో ఉంది కాబట్టి ఇష్టమొచ్చినట్టు చేస్తామంటే దాన్ని విప్లవం అంటారా?

రాజ్యంలో కచ్చితంగా తప్పులున్నాయి. కానీ, రాజ్యాన్ని సంస్కరించే శక్తి జనం చేతుల్లో ఉన్నంత కాలం, ఓటు హక్కు మనకున్నంతకాలం, స్వేచ్ఛగా మాట్లాడుకునే అవకాశం ఉన్నంతకాలం నేను తుపాకీ పడతాను అనే హక్కు ఎవరికీ లేదు. ఉండకూడదు కూడా. ఎందుకంటే, నీ దగ్గర ఉన్న తుపాకీ కంటే రాజ్యం దగ్గర పెద్ద తుపాకీ ఉంటుంది. గాడి తప్పిన, బూజు పట్టిన సిద్ధాంతాన్ని పట్టుకుని ఇది పరిష్కారంలో భాగమవుతుంది అనడం ఆశ్చర్యకరం. సమస్యలకి పరిష్కారం ప్రజల్లో చైతన్యం, ఓటు. నాకు తెలిసి ఎక్కడా ఈ మావోయిస్టులు/నక్సలైట్లు విద్య కోసం, ఆరోగ్యం కోసం పోరాడి సాధించిన దాఖలాలు లేవు. కాబట్టి శాంతి కావాలి, న్యాయం కావాలి అనుకుంటే.. కచ్చితంగా శాంతి లేకుండా న్యాయం సాధ్యం కాదు. దీర్ఘకాలంలో న్యాయం లేకుండా శాంతి కొనసాగడం సాధ్యం కాదు. జనం పేరుతో జనాన్ని చంపడం కరెక్టు కాదు. లోపభూయిష్టమైన విధానాలకు పరిష్కారం సమర్థమైన విధానాలు, అవినీతి పాలనకు పరిష్కారం నీతిమంతమైన పాలన, దుర్మార్గమైన రాజకీయానికి పరిష్కారం మంచి రాజకీయం. తుపాకీ మాత్రం ఏనాడూ పరిష్కారం కాదు. అది సమస్యలో భాగం. అదీ సమస్య."

గుత్తాధిపత్యాన్ని, ప్రభుత్వోద్యోగుల పెత్తనముండే లైసెన్స్‌రాజ్ వ్యవస్థను పెద్దఎత్తున కొనసాగిస్తూ ప్రజలను కష్టాలపాలు చేశారు. మూకుమ్మడిస్థాయిలో పేదరికాన్ని నిరంతరం కొనసాగిస్తూ వచ్చారు. మార్క్స్ కంటే ముందు ఆడమ్ స్మిత్ 'ఇన్‌విజిబుల్ హ్యాండ్'

సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. వ్యక్తులు తమ స్వార్థం కోసం పనిచేసే క్రమంలోనే అయినా నిజమయిన పోటీతో, స్వేచ్ఛగా జరిపే లావాదేవీలు అదృశ్యంగా సమాజానికి మేలు చేస్తాయని, దీనివల్ల అసంకల్పితంగానే మార్కెట్‌లో వస్తువుల డిమాండ్-సప్లయ్‌ల మధ్య సమతుల్యత నెలకొంటందని ఆయన చెప్పారు. అయితే ఇందుకు స్వేచ్ఛా మార్కెట్ అవసరం. ఈ సిద్ధాంతం వాస్తవమని కాలక్రమంలో రుజువైంది. స్మిత్ వేసిన ఈ స్వేచ్ఛామార్కెట్ పునాదిని మార్క్స్ విస్మరించారు. సంపద సృష్టిని సంపద పోగుపడటంగా భ్రమపడి.. వర్గపోరాటాలు, శ్రామిక నియంతృత్వ వ్యవస్థ వంటి ప్రతిపాదనల్ని మార్క్స్ చేశారు. ఈ విషయంలో మార్క్స్ వాదన సరికాదు అని చెప్పటానికి మొబైల్ టెలీఫోన్లే పెద్ద ఉదాహరణ.

సోషలిస్టు భావజాలంతో పాలించిన ప్రభుత్వాల వల్ల ఒకప్పుడు మనదేశంలో ఫోన్ కావాలంటే పెద్ద క్యూ లో దరఖాస్తులను పంపాల్సి వచ్చేది. డిపాజిట్లు, ఏళ్ల తరబడి వేచిచూడటాలు, లంచాలు, రిపేర్లు వస్తున్నప్పుడల్లా మళ్లీ లంచాలు.. ఇలా జనాన్ని ప్రభుత్వ యంత్రాంగం పీల్చిపిప్పి చేసేది. ఆర్థిక సంస్కరణలు మొదలైన 1991 నాటికి మనదేశం మొత్తంలో 70 లక్షల టెలీఫోన్లు ఉంటే, ప్రభుత్వ గుత్తాధిపత్యం తీసేసినాక కొన్నేళ్లపాటు ప్రతినెలా కోటికిపైగా కొత్త ఫోన్లు వచ్చాయి. మొబైల్ ఫోన్ తయారు చేసే కంపెనీల యజమానులకు వందల, వేల కోట్ల లాభాలు రావచ్చు. కానీ ఆ ఫోన్‌లు ఈవేళ కొందరికే కాకుండా, అందరికీ అందుబాటులోకి వచ్చాయి. ఆ ఫోన్‌ల ద్వారా వాళ్లు ప్రయోజనాల్ని పొందుతున్నారు. ఫోన్‌ని అడ్డంపెట్టుకుని తమనెవరో దోచేస్తున్నారని, ఫోన్‌ని కొనుగోలు చేయటం ద్వారా తాము ఎవరి చేతిలోనో దోపిడీకి గురవుతున్నామని ప్రజలెవరూ భావించటం లేదు. ఓ పెద్దసంస్థ, మధ్యలో అనేక సరఫరా ఏర్పాట్లు ఉండటం వల్లే ఇదంతా సాధ్యమైంది. తద్వారా పలువురికి ఉపాధి లభ్యమవుతోంది. మొబైల్ సంస్థల్లో ఉద్యోగాలు చేస్తున్నవారు కూడా.. తాము దోపిడీకి గురవుతున్నట్టేమీ బలవంతంగా పనిచేయటం లేదు. ఫోన్ ఉత్పత్తిదారుల తరహాలో వినియోగదారులు సైతం ఫోన్‌ల ద్వారా ఆర్థికకలాపాలు నిర్వహించుకుంటూ తమ పరిధిలో సంపదసృష్టించుకోగలుగుతున్నారు. మార్క్స్ థియరీ ప్రకారమైతే మొబైల్‌ఫోన్ల తయారీ పెద్ద దోపిడీ కార్యక్రమం అయ్యుండాలి. మనమంతా భయపడి ఫోన్‌లు కొనకుండా ఉద్యమాలు చేయాలి. కానీ మొబైల్‌ఫోన్ తయారీ, చేరవేత, వినియోగంలోని ఆర్థికకలాపాన్ని సంపద పోగుపడటంగా కాకుండా సంపదసృష్టిలో భాగమైందని పరిణామాలు చెబుతున్నాయి. కేవలం పెట్టుబడి పెట్టినవారు, అందులో ఉపాధి పొందేవారే కాకుండా.. వారు ఉత్పత్తి చేసే వస్తువుల్ని వినియోగించేవారు కూడా సంపదసృష్టిలో భాగస్వాములయ్యే మార్పుని మార్క్స్ ఊహించలేదు. అందుకే స్వేచ్ఛా మార్కెట్‌ను సంపదసృష్టిలో భాగంగా చూడకుండా మార్క్స్ ఊహించిన సమసమాజం.. ఎక్కడా ఆచరణరూపం దాల్చలేదు.

మొబైల్‌ఫోన్ల వంటి మార్పులు, సృజనాత్మక ఆవిష్కరణలు కేవలం స్వేచ్ఛతో ముడిపడిన రాజకీయ, ఆర్థిక వ్యవస్థలతోనే సాధ్యమయ్యాయి. సృజనాత్మకత వెల్లివిరియటానికి వ్యక్తి భావప్రకటనా స్వేచ్ఛ, స్వేచ్ఛామార్కెట్‌లు చోదకశక్తులు. స్వేచ్ఛ ఇచ్చే ఈ ప్రోత్సాహకాల్ని మార్క్స్ పూర్తిగా తోసిపుచ్చారు. ఈ రెంటినీ కట్టడి చేస్తూ నియంతృత్వ పాలనతో కేవలం భౌతికావసరాలకే మార్క్స్ ప్రతిపాదనలు ప్రాధాన్యం ఇవ్వటంతో.. మార్క్సిస్టు రాజ్యవ్యవస్థల్లో సంపదసృష్టి, ప్రజల భాగస్వామ్యం క్రమంగా కుంటుపడ్డాయి. మొబైల్ వంటి టెక్నాలజీతో వ్యక్తిగత అభిరుచులు, ఊహల నుంచి భారీఎత్తున డేటా ఉత్పన్నమవుతుందని, అదో పెద్ద ఆర్థిక ఇంధనమవుతుందని మార్క్స్ ఊహించి ఉండరు (బిగ్ డేటా ఎనలిటిక్స్ వంటివి వ్యక్తి స్వేచ్ఛను హరించే విష వ్యాపారాల్లా కాకుండా.. చట్టబద్ధ, ప్రజాస్వామిక విషయ వ్యాపారాల్లా కొనసాగటానికి పటిష్ట నియంత్రణా ఏర్పాట్లు చేయటం వేరే అంశం).

మనిషి తార్కికంగా ఆలోచించటానికి ముందు.. ఎటువంటి తర్కమూ ఉండని ఊహల దశ ఒకటి (తెలిసిన విషయాన్ని అప్‌డేట్ చేసుకోవటంలో కూడా) ఉంటుందని మార్క్స్ గుర్తించారు. అలాగే, బైటి నుంచి ప్రోత్సాహకాలు లేకపోయినా మనిషిలోని సాధారణ స్థాయి ఉత్సుకత, ఊహలు సరైన దిశలోనే సాగటానికి ఓ భౌతికమైన ఏర్పాటు ఉండాలి అని కూడా అర్థం చేసుకున్నారు. కానీ.. ఎలా పనిచేస్తాయో అర్థం కాని ఊహల్ని తార్కిక ప్రమాణాల పరిధిలోకి రావడానికి అణచివేత పద్ధతి ఉపయోగపడుతుందనుకున్నారు. భౌతిక అవసరాలు తీర్చి ఉద్వేగాలను అణచివేస్తే చాలు.. ఊహాదశ నుంచి మనిషి తర్కబద్ధ

## బిహేవియరల్ ఎకనామిక్స్‌ను ఆమోదించటానికి.. మార్క్స్ 'తార్కికత' వాదనను తోసిపుచ్చనక్కర్లేదు

2017లో రిచర్డ్ థాలెర్ ప్రవర్తనా ఆర్థికశాస్త్ర (బిహేవియరల్ ఎకనామిక్స్) సూత్రీకరణకు ఆర్థికశాస్త్ర నోబెల్ బహుమతి రావటం మార్క్సిజం వైఫల్యానికి నిదర్శనమని కొందరు వాదిస్తుంటారుగానీ.. అది పూర్తి వాస్తవం కాదు. ప్రతిదీ శాస్త్రీయంగా, తార్కికంగానే జరుగుతుందన్న మార్క్స్ వాదన సూత్రప్రాయంగా కరెక్టే. కానీ, ఒక ఆలోచన తర్కబద్ధంగా హేతువుగా రూపుదిద్దుకునే ముందు 'ఊహ' రూపంలో మదిలో మొదలవుతుంది. ప్రతి ఆలోచనా ఊహ కానక్కర్లేదు కానీ, ప్రతి కొత్త ఆలోచనా సాధారణంగా ఊహగానే మొదలవుతుంది. యధాలాపంగానే మనకో ఆలోచన తట్టినా.. అది మన ఎరుకలో లేకుండా ఏదోకరకంగా మన అంతరంగ చేతనలో కొనసాగుతూ భౌతిక పరిస్థితులు అనుకూలించగానే బైటపడి ఉండవచ్చు. మనస్తత్వాన్ని, ఆర్థికాన్ని కలగలుపుతూ ఈ స్పేస్‌లో థాలెర్ వాదనలు సాగాయి. అందుకే.. ఆర్థికంగా మనిషి తీసుకునే నిర్ణయాలన్నిటికీ హేతుబద్ధత ఉండనక్కర్లేదని ఆయన తేల్చారు. అలాగే కొన్ని భౌతిక పరిస్థితులను కల్పిస్తే.. ఉదాహరణకు ప్రభుత్వం పొదుపును ప్రోత్సహించేలా రాయితీల్ని ప్రకటించటం.. మనుషులు హేతుబద్ధంగా ప్రవర్తిస్తారని రుజువు చేశారు. అంతకుముందు పొదుపు విలువ తెలిసినా ఇదే మనుషులు పట్టించుకోకుండా ఉండేవారని వివరించారు. హేతుబద్ధతకు ముందు ఊహ ఉండొచ్చు, అలాగే ఆ ఊహ కొంత ముందుకుసాగాక (ఇది కొత్త సృష్టిని చేసే అద్భుత సృజనాత్మకత కూడా కావొచ్చు) హేతుబద్ధ ప్రమాణాలను గుర్తించగలం. తర్కానికి అందని ప్రవర్తన మనిషిలో ఉంటుందని మార్క్స్ కూడా గుర్తించినా.. భౌతిక అణచివేతతో దాన్ని తర్కం పరిధిలోకి తేవచ్చని పొరబడ్డారు.

కాబట్టి, "ఊహ – హేతుబద్ధత – ఊహాశక్తి లేదా సృజనాత్మకతను సరైన దిశ (దృక్పథం/యాటిట్యూడ్) లోకి మళ్లించటానికి భౌతిక పరిస్థితుల్ని/ప్రోత్సాహకాల్ని కల్పించటం" అనే కాలపరీక్షకు నిలబడిన నమూనాలో.. వేలం పాటల్లో ప్రభుత్వాలు అత్యధికంగా డబ్బును ఆర్జించటానికి దోహదం చేసిన న్యాష్ ఈక్విలిబ్రియం థియరీ సహా మార్క్సిజం, థాలెర్ తదితరుల బిహేవియరల్ ఎకనామిక్స్ వంటి వాటిని భాగం చేయవచ్చు.

దశలోకి రావడం సాధ్యమవుతుందని పొరబడ్డారు. మనిషి ఊహలు ఏ మలుపులు తిరుగుతాయో, సృజనాత్మకత ఎలా పనిచేస్తుందో మార్క్స్ కాదు గదా, ప్రపంచంలో ఏ ఒక్కరూ చెప్పలేరు. అంతెందుకు.. మార్క్సిజాన్ని ఆచరణలోకి తెచ్చే క్రమంలో వివిధ దేశాల్లో చేసిన అమానుషాల వల్ల కోట్లాదిమంది అమాయక ప్రజలు, ఆలోచనాపరులు అకాల మరణం చెందటానికి ఆయా నాయకుల వ్యక్తిగత ఆలోచనలు కారణం కాదా? తన భక్తులమని చెప్పుకుంటున్నవారి పుర్రెల్లో అలాంటి బుద్ధులు పుడతాయని మార్క్స్ కలలో కూడా ఊహించివుండరు. కమ్యూనిజం లేబుల్ అంటించుకున్న అనేక దేశాల్లో నిరంకుశాధికారాలను చెలాయించిన ప్రభుత్వాల హయాంలో కూడా కొన్ని ఆవిష్కరణలు జరిగాయి. కానీ అవి పూర్తిగా నిరంకుశ నేతలు ఎంపిక చేసిన ఆవిష్కరణలు. అణచివేత, హింస, యుద్ధాల చుట్టూ మాత్రమే తిరిగాయి. విశాల ప్రజానీకంలోని వినూత్న ఊహలు, ఆలోచనలు అణగారి నీరుగారిపోయి ఓ వికృత వ్యవస్థ తయారైంది.

ఏ పుర్రెలో ఎపుడు ఏ బుద్ధి పుడుతుందో అంచనాలు వేస్తూ కూర్చోవటం వృధా కూడా. దానికి బదులు అణచివేత లేకుండా ప్రతి వ్యక్తి సృజనాత్మక ఆలోచనలూ సరైన దిశలో ఉండేలా సరైన ప్రోత్సాహకాలనిచ్చే వ్యవస్థల నిర్మాణం చేస్తే.. సృజనాత్మకత కూడా మందిహితం కోసం సాగుతూ మనకి, సమాజానికీ ఎంతో ప్రయోజనం సమకూరుతుంది. ఇందులో విఫలమవటం వల్ల.. స్వేచ్ఛామార్కెట్ దేశాల్లో ఆవిష్కరణలు పెరుగుతున్న కొద్దీ మార్క్సిజం పరిమితమవుతూ వచ్చింది.

అయితే మార్క్స్ ప్రతిపాదనల్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నవారు, మార్క్సిజం విఫలమైందని భావిస్తున్నవారు, అసలు మార్క్సిజం అంటే ఏమిటో తెలియనివారిలో కూడా కోట్లాది మంది ఆయన ప్రతిపాదించిన మరోప్రపంచం రావాలని గాఢంగా కోరుకుంటున్నారని మనం విస్మరించకూడదు. నిజానికి మార్క్స్ కంటే ఎంతో ముందుకాలం నుంచీ మానవజాతి ఈ ఉదాత్త లక్ష్యం వెనుక పరిగెడుతోంది. అనేకులు మహనీయులు ఈ దిశగా కృషి చేశారు. సోషలిజానికి పిచ్చి భాష్యం చెప్పి సామాన్య, మధ్యతరగతి ప్రజలు నిరంతరం బతుకుభయంతో పాలకులు, ప్రభుత్వాధికారుల వద్ద ద్వితీయశ్రేణి పౌరులుగా చేయిజాచి

## వ్యవస్థీకృత నిజాయతీ ఉన్న నాయకులు కావాలి

మార్క్స్ చెప్పిన శ్రమ సంస్కృతి కూడా ఏరూపంలోనైనా నిరంతర ప్రాధాన్యత కలిగివుంటుంది. భారత్‌లో రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో కొంతమందినైనా పుస్తకాల అధ్యయనానికి సీరియస్‌గా పురిగొల్పటంలో మార్క్స్‌వాదుల ప్రభావం గణనీయమైనదనటంలో సందేహం లేదు. అలాగే కమ్యూనిస్టులు, బీజేపీ, మరో పార్టీ లేదా సంఘం.. వీటన్నిటిలో వ్యక్తిగత నిజాయతీపరులున్నారని నేను చాలాసార్లు బహిరంగంగానే చెప్పాను. మాణిక్ సర్కార్‌లాగా కళ్లు చెమర్చేస్థాయి నిజాయతీని ప్రదర్శించేవారూ ఉన్నారు. అంతెందుకు, నరేంద్రమోదీ వ్యక్తిగత జీవిత ప్రమాణాలేమన్నా ఆషామాషీవా? కానీ ఈ దేశానికి అది చాలదు. గాంధీజీ కూడా వ్యక్తిగత త్యాగాలతో మహాత్ముడు కాలేదు. కనీస నైతిక విలువలతో సుఖసంతోషాలతో జీవించే వ్యవస్థల నిర్మాణం చేసే వ్యవస్థీకృత నిజాయతీ ఉన్న వారు మనకు కావలసింది! సమాజంలో చిట్టచివరి పౌరునికీ అవకాశాల్ని అందించటం వల్ల చివరకు తనకే మేలు జరుగుతుందనే ఎరుకతో నైతికతను-తన ప్రయోజనాలకు మధ్య ఉన్న సంబంధాన్ని ప్రతి పౌరురాలు, పౌరుడు గుర్తించేలా, తన ఓటుకు-తను కడుతున్న పన్నుల డబ్బుకు సంబంధాన్ని అర్థం చేసుకునేలా వ్యవస్థల్ని నిర్మించే నిజాయతీ ఉన్న నాయకులు కావాలి. ఇలాంటి వ్యవస్థీకృత నిజాయతీతో ప్రజలకు సాధికారతనిస్తూ, ప్రతి తరం తన ముందున్న సమస్యల్ని పరిష్కరిస్తూ కొత్తతరానికి కొత్త సమస్యల్ని మాత్రమే మిగల్చాలి" అనే స్పష్టతతో పనిచేస్తోంది కాబట్టే.. "లోక్‌సత్తా భావాలు అజరామరం" అని ధీమాగా ప్రకటించగలిగాను.

అర్థించేట్టు చేయటం వల్ల 130 కోట్ల జనాభా వున్న మనదేశం ఈ లక్ష్యానికి ఇంకా చాలాదూరంలోనే మిగిలిపోయింది. చాలా కమ్యూనిస్టు దేశాల్లో పాటి కూడా మనదేశంలోని సోషలిస్టువాదులు చేయకుండా విద్య, ఆరోగ్యం వంటి వాటిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. వివక్షలు లేకుండా అందరూ సమానంగా ఉండే వ్యవస్థ మనదేశంలోని స్వేచ్ఛాయుత ఆధునిక ప్రజాస్వామ్యంలో పూర్తిగా సాధ్యం. సరైన సంస్కరణలు, వ్యవస్థల నిర్మాణం ద్వారా ఆ సమానత్వాన్ని సాధించవచ్చు. అందరూ సమానమే అంటే.. ట్రైబల్ గుంపుల్లో ఆలోచించినట్టు పొడుగు, రంగు, లావు, ఆదాయం, సౌకర్యాల్లో సమానమని కాదు. ప్రతి వ్యక్తికీ ఎదిగేందుకు సమానావకాశాలు ఉండటం! ఉదాహరణకు, గ్రామంలో ఉంటూ తల్లిదండ్రులకు చదువు లేకుండా ఉన్న పేద అమ్మాయి పాఠశాలలో నూటికి 80 మార్కులు తెచ్చుకుంటే, పట్టణంలో తల్లిదండ్రులు చదువుండి, డబ్బు పెట్టి ట్యూషన్లు చెప్పిస్తే ఓ అబ్బాయి అదే తరగతిలో నూటికి 90 మార్కుల్ని తెచ్చుకున్నాడనుకోండి. వీరిలో ఎవరిది నిజమైన ప్రతిభ? కచ్చితంగా తక్కువ మార్కులు వచ్చిన ఆ అమ్మాయిదే. ఆ అమ్మాయికి ఎదిగే అవకాశాలు ఇవ్వకపోవటం సమాజం తప్పిదం. అందుకే సమానత్వం అసాధ్యం, జీన్స్ అనే వాదనల జోలికిపోకుండా.. ప్రకృతో, దేవుడో ఇచ్చిన సామర్థ్యాన్ని వికసింప చేసుకునే అవకాశాన్ని వివక్ష లేకుండా ప్రతి బిడ్డకూ అందించగలగాలి. కేవలం పుట్టుక వల్ల ఓ బిడ్డ బతుకు నిర్ణయమైపోతే, అంతకంటే అవమానం, పాపం మానవాళికి ఉండదు. ఇలా మంచి విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలు వంటి వాటి ద్వారా ఎదిగే అవకాశాల్ని అందరికీ సమానంగా అందించాక.. ఎవరు ఏ మేరకు ఎదుగుతారన్నది వారి అభిరుచి, ప్రతిభ, వ్యక్తిగత కృషి మీద ఆధారపడి ఉంటుంది. కాబట్టి అప్పుడు కూడా తేడాలుంటాయి. కానీ అందరికీ ఎదిగే అవకాశాలుంటాయి, మరీ విపరీతమైన అంతరాలుండవు. ఎన్ని అవకాశాలు కల్పించినా వైకల్యాలరీత్యా నిస్సహాయులుగా ఉండేవారికి, ఉచితంగానో మరో రూపంలోనో సమాజం తోడ్పాటునిస్తుంటుంది. ఇదీ నిజమైన సమానత్వం! ఇందుకోసం.. సమాజంలో చిట్టచివరి పౌరునికీ అవకాశాల్ని అందించటం వల్ల చివరకు తనకే మేలు జరుగుతుందనే ఎరుకతో నైతికతను-తన ప్రయోజనాలకు మధ్య ఉన్న సంబంధాన్ని ప్రతి పౌరురాలు, పౌరుడు గుర్తించేలా, తన ఓటుకు-తను కడుతున్న పన్నుల డబ్బుకు సంబంధాన్ని అర్థం చేసుకునేలా వ్యవస్థల్ని నిర్మించాలి. ఎలాంటి వ్యవస్థలోనైనా ఓ ఐదు శాతంమంది అన్నిటికీ అతీతంగా మంచి చేస్తుంటే, మరో ఐదు శాతం అన్నిటికీ అతీతంగా చెడు చేసేవారుంటారు. అలాంటి చెడ్డవారిని నియంత్రించటానికి మినహా కఠిన చట్టాలు ఉండకూడదు. ఇలాంటి వ్యవస్థల ఏర్పాటు తప్ప.. మార్క్సిజం

ఊహించినట్టు రాజ్యరహిత వ్యవస్థ ప్రత్యేకించి ఏర్పడే, మనుగడ సాగించే అవకాశం లేదు. ఈ ఏర్పాట్లకు తోడు వ్యక్తిగత స్వేచ్ఛ, స్వేచ్ఛామార్కెట్ విస్తరణకు ఆలంబనగా కుటుంబ విలువలు, పర్యావరణం, సామరస్యత, హేతుబద్ధ, ప్రామాణిక బహిరంగ చర్చలు వంటివాటిని పెంపొందించే దిశగా సామాజిక రాజకీయాన్ని ప్రోత్సహించాలి. అప్పుడే మనిషి లక్ష్యమైన సంతోషమయ జీవితం సాకారమవుతుంది.

అందరికీ అన్నీ అందించటం ఈ ప్రపంచంలో సాధ్యం కాదని ఒకప్పుడు నమ్మేవారు. ఏదోకరూపంలో బండబలం ఉన్నవారు ఎక్కువ పొందుతూండేవారు. ఇతరులు తలంచుకుని తమకు పనులు చేసిపెట్టటానికి ఎంతో కొంత తిండి, ఇతర అవసరాల్ని విదిలిస్తుండేవారు. సరైన ఆహారం లేక అలమటిస్తూ జనం చస్తుంటే.. అది లోకధర్మంలో భాగమనుకుని సరిపెట్టుకునేవారు. కానీ ప్రభుత్వాల పాత్ర నిర్వచనం మారటంతో, ఆవిష్కరణలతో శాస్త్ర, సాంకేతిక రంగాలు పురోభివృద్ధి చెందటంతో ఆ పరిస్థితి మారింది. అందరికీ మౌలిక వసతుల్ని అందించవచ్చు అనేది తేటతెల్లమైంది. ఒకరి గెలుపు ఇంకొకరి ఓటమి.. అనే 'జీరో-సమ్' వ్యవహారశైలి అక్కర్లేదనే పరిస్థితులు రూపుదిద్దుకున్నాయి. ఇందులో మార్క్సిజం ప్రభావం ఉంది, స్వేచ్ఛ చుట్టూ నిర్మితమైన రాజకీయ, ఆర్థిక వ్యవస్థల ప్రభావమూ ఉంది. చరిత్ర క్రమంలో కొన్ని మౌలిక సమస్యల్ని ఎదుర్కోవటంలో భాగంగా మార్క్స్ కృషిని గుర్తించాలనటంలో సందేహం లేదు. కానీ మార్క్సిజాన్ని సార్వజనీనమయిన శాశ్వత సత్యాల పవిత్రగ్రంథంగా భావిస్తేనే తంటా. ప్రతి కొత్తతరం తన పాతతరంలోని మంచిని తీసుకుంటూ కొత్త ఆలోచనలతో ముందుకెళ్లాల్సిందే. ఎంత గొప్పవారు చెప్పినా అవి సార్వకాలీన సత్యాలు కాకపోవచ్చు. అందుకే తన కాలపరిస్థితుల నుంచి మానవాళికి మేలు చేసేందుకు కృషి చేసిన మహనీయుడిగా మార్క్స్‌ని గుర్తిద్దాం.

మార్క్సిజం సహా అందుబాటులో ఉన్న అన్ని సిద్ధాంతాలు, విధానాలలోని లోపాలనూ పరిష్కరించి మనం ఎంత గొప్ప వ్యవస్థ నిర్మాణం చేసినా.. మానవ నిర్మాణం పరిపూర్ణం కాదనే ఎరుక మనకు ఎప్పుడూ ఉండాలి. మానవాళికి రాబోయే కాలంలో ఎదురవనున్న పెనుసవాళ్లను ఈ అవగాహన నుంచే స్వీకరించాలి. యాంత్రీకరణ, కృత్రిమ మేధ వంటి వాటి వల్ల చోటుచేసుకుంటున్న ఆర్థిక మార్పుల వల్ల యువతకు ఉపాధి అంతుచిక్కని సమస్యగా మారనుంది. కొన్ని రకాల ఉపాధి అవకాశాలు ఎలా ఉంటాయో కూడా చెప్పలేకపోతున్నారు. 60శాతం మంది శక్తిసామర్థ్యాలు నిరుపయోగంగా ఉండే (యూస్‌లెస్ జనరేషన్) రాబోతోందని హెచ్చరిస్తున్నారు. డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికవటానికి వెనకనున్న ప్రధాన కారణం లక్షలాది కార్మికులు, దిగువమధ్యతరగతి ప్రజలలో మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం, ఉత్పత్తి శక్తుల పుణ్యమా అని అభద్రత, భవిష్యత్తు పట్ల భయం పెరగటమే! అంటే ఆధునిక పోకళ్లలో, సాంకేతిక పరిజ్ఞానంలో, పారిశ్రామికీకరణలో, సంపదసృష్టిలో అగ్రస్థానంలో ఉన్న సమాజాలలో కూడా వేగంగా వచ్చే మార్పు అస్థిరత్వానికి దారితీస్తుంది.

కానీ నిరాశ అక్కర్లేదు. గతంలోలాగే, కొత్త ఆలోచనలతో నూతన పరిష్కారాలతో ముందుకు సాగితే కచ్చితంగా మానవాళి మరింత మెరుగైన జీవితాన్ని సాధించగలుగుతుంది. ప్రజలకు సాధికారతనిస్తూ, ప్రతి తరం తన ముందున్న సమస్యల్ని పరిష్కరిస్తూ కొత్తతరానికి కొత్త సమస్యల్ని మాత్రమే మిగిల్చేలా వ్యవస్థీకృత నిజాయతీతో వ్యవహరించటమే మనం చేయవలసిన పని.

గతంలో మానవాళి మార్పుని ఆహ్వానించినట్లుగానే, నేటితరం కూడా మారుతున్న పరిస్థితులని అర్థం చేసుకుని, సమాజంలో సంపద, వ్యక్తుల ఆనందం పెరిగేరీతిన ఆర్థిక, సామాజిక, రాజకీయ వ్యవస్థలని పునర్నిర్మించుకోవాలి. అందుకు యువతని సిద్ధం చేయాలి. దశాబ్దాల తరబడి కొన్ని తరాలపాటు మార్క్స్ ప్రతిపాదనలే సర్వరోగనివారిణి అని నమ్మి భుజాన మోసినవారికి.. వాటిల్లోని మౌలికలోపాలని ఒప్పుకోవటం కష్టమే కావచ్చు. కానీ తమ తాతతండ్రులు, తామూ జీవితపర్యంతం నమ్మిన అంశాల్లో లోపాలున్నాయని తేలినప్పుడు కూడా.. వాస్తవాల్ని హత్తుకుని లోపాల్ని దిద్దుకోగలగటమే సత్యాన్వేషణ. ఇదే నిజంగా జీవించటమంటే! మార్క్సిజాన్ని గుడ్డిగా ఆరాధించకుండా వాస్తవ విలువకనుగుణంగా గౌరవిస్తే ఏ గొడవా ఉండదు. ❍

# కేటాయింపులెక్కువ... ఖర్చుపెట్టేది తక్కువ

## - తెలంగాణ ఆర్థిక నిర్వహణ తీరు మారాలన్న కాగ్ నివేదిక -



వేల కోట్ల రూపాయల కేటాయింపులు ఉంటున్నా.. నిధుల వ్యయం మాత్రం నిరాశాజనకంగా ఉందని, తెలంగాణ రాష్ట్ర ఆర్థిక నిర్వహణ మారాల్సిన అవసరం ఉందని కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) నివేదిక పేర్కొంది. మొత్తం వ్యయంలో పెట్టుబడి వ్యయం ఇతర

### విఫలమైన విద్యాశాఖ

తెలంగాణలో విద్యాహక్కు చట్టం అమలవటం లేదని, ప్రతి అంశంలోనూ విద్యాశాఖ విఫలమైందని కాగ్ తేల్చింది. ప్రభుత్వ విద్యపై నిర్లక్ష్యం వహించటంతో ప్రైవేటు స్కూళ్లు లబ్ధి పొందుతున్నాయని తెలిపింది. 2014-17 మధ్యకాలంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య సుమారు 1.12 లక్షలు తగ్గిపోగా, ప్రైవేటు స్కూళ్లలో 61 వేల వరకు పెరిగినట్టు వెల్లడించింది. ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలల్లో ప్రవేశాలు 20వేలు తగ్గగా, ప్రైవేటులో 3వేలు పెరిగాయి. ప్రైవేటులో ఫీజులు ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నారని తెలిపింది. మధ్యలో బడి మానేసే విద్యార్థుల సంఖ్య (డ్రాపవుట్లు) సంఖ్య ఎక్కువగా ఉందని చెప్పింది. ఎస్సీ, ఎస్టీ బాలికల విషయంలో ఇది ఎక్కువగా ఉన్నదంది.

- 2014-17లో ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలల సంఖ్య 0.42 శాతం పెరగ్గా.. ప్రైవేటు ప్రాథమిక పాఠశాలల సంఖ్య 12.75 శాతం పెరగింది.
- ఇతర గ్రామాల్లోని పాఠశాలల్లో చదివేందుకు వెళ్లే విద్యార్థులకు ప్రభుత్వం రవాణా ఛార్జీలు అందించడంలో విఫలమైంది.
- ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి ఎక్కడా సరిగ్గా పాటించడం లేదు.
- నిధులు, వసతులు ఉన్నా.. అధికారుల నిర్లక్ష్యం వల్ల శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో తెలుగుతల్లి ప్రాంగణం కార్యరూపం దాల్చలేదు. ఆరేళ్లుగా ఈ ప్రాంగణాన్ని నిర్మించకపోవడంతో రూ.8.79 కోట్ల యూజీసీ సాయాన్ని కోల్పోవడమే కాకుండా విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమయ్యారు.

### ప్రభుత్వ వైద్యం డొల్ల

ప్రభుత్వ వైద్యసేవల్లో నాణ్యతా ప్రమాణాలు లోపించడం వల్ల రోగులు ప్రయివేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని కాగ్ నివేదిక వెల్లడించింది. ఆరోగ్య ఉపకేంద్రాల్లో పురుష సహాయకుల కొరత 100 శాతం ఉండగా.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది కొరత 43 శాతం ఉందని తెలిపింది. 2014-17 నడుమ వైద్యసేవల మూల్య నిర్ధారణ జరగలేదని తేల్చిచెప్పింది. రాష్ట్రంలో ప్రసూతి, శిశుమరణాల సమీక్షను నిర్వహించకపోవడం.. ఒకవేళ నిర్వహించినా అవి క్రియాశీలంగా లేకపోవడంతో మాతాశిశు మరణాలకు దారితీసే పరిస్థితులను గుర్తించలేకపోయారని, తద్వారా నివారణ చర్యలపై దృష్టి పెట్టలేదని పేర్కొంది. ఆదిలాబాద్ (152), ఖమ్మం (99), మహబూబ్‌నగర్ (98) వంటి గిరిజన జిల్లాల్లో ప్రసూతి మరణాలు అధికంగా ఉన్నాయని, సగటున తెలంగాణలో ప్రతి లక్ష ప్రసవాలకు ప్రసూతి మరణాల సంఖ్య 92గా ఉందని తెలిపింది. జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకాల అమలుతీరు సక్రమంగా లేదని స్పష్టంచేసింది.

- ఆస్పత్రి స్థాయిలో వార్షిక సర్వేలు చేపట్టి, లోపాలను కనిపెట్టి, అంతరాయాలను తొలగించే ప్రయత్నం రాష్ట్రంలో ఎక్కడా జరగలేదు.

- జాతీయ ఆరోగ్య మిషన్ నిధుల వినియోగం 2012-14లో 38-44 శాతం ఉండగా, 2014-17లో 39-46 శాతమే ఉంది.
- ఉచిత అత్యవసర మందుల పంపిణీ కింద 2014-17లో 83.99 కోట్లు కేటాయించగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.10.11 కోట్లు (12శాతం) మాత్రమే వాడుకుంది.
- పిల్లల ఆరోగ్య పరిరక్షణకు 2014-17 నడుమ ఆమోదించిన వ్యయంలో ఏ సంవత్సరం కూడా 26 శాతానికి మించలేదు.
- నాణ్యతా పరిరక్షణ కోసం కేటాయించిన రూ. 3.12 కోట్లలో 99శాతం నిధులు ఖర్చు కాలేదు.
- ప్రైవేటు ఆస్పత్రుల్లో కాన్పులు 31 శాతం నుంచి 58 శాతానికి పెరిగాయి.
- సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాంతీయ, జిల్లా ఆస్పత్రుల్లో వైద్యనిపుణుల కొరత 23 నుంచి గరిష్టంగా 73 శాతం దాకా ఉంది.
- ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది కొరత, వైద్యసేవలు సరిగా అందకపోవడం, మెరుగైన మౌలికవసతులు కొరవడడం, ఆరోగ్య భద్రత ఆశించినరీతిలో లేకపోవడం.. తదితర కారణాలతో ప్రజలు ప్రైవేటు ఆస్పత్రుల వైపు మళ్లుతున్నారని నివేదిక తెలిపింది.
- గర్భిణుల్లో రక్తహీనత కేసులు 2012-13లో 1.42 లక్షలుండగా, 2016-17లో 2.93 లక్షలకు పెరిగాయి.
- 2017-18లో నిధులు సరిగా వినియోగించుకోకపోవడం, మళ్లించడం తదితర వేర్వేరు రూపాల్లో సుమారు రూ.64 కోట్ల మేరకు అక్రమాలు జరిగినట్టుగా వెల్లడించింది.

మొత్తం వ్యయంలో పెట్టుబడి వ్యయం ఇతర రాష్ట్రాల్లో కంటే తెలంగాణలో ఎక్కువగా ఉంది. పెట్టుబడి వ్యయం రాష్ట్రంలో 28.22 శాతం కాగా సాధారణ వర్గం రాష్ట్రాల సగటు 19.70 శాతం. ఇది మెరుగైన దీర్ఘకాలిక ఆర్థిక నిర్వహణను సూచిస్తోంది. ఆర్థిక సేవల రంగంలో మొత్తం వ్యయంలో పెట్టుబడి వ్యయం వాటా వ్యవసాయం, అనుబంధ రంగాలు, సాగునీరు, విద్యుత్తు, రవాణా రంగాల్లో 58.59 శాతంగా ఉంది. 2015-16లో ఇది 33.62 శాతం మాత్రమే. సాంఘిక సేవలు, ఆర్థిక సేవలు (అభివృద్ధి) వ్యయం పెరగడం నిధుల వినియోగ సమర్థతను ప్రతిబింబిస్తుంది. ఆరోగ్యంపై వ్యయం సాధారణవర్గం రాష్ట్రాలతో సమానం. విద్యపై చేసిన వ్యయం ఇతర సాధారణ వర్గం రాష్ట్రాల కంటే ఇక్కడ తక్కువ.

## ఆస్తుల కల్పనకు పెరిగిన ప్రాధాన్యం

తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధి, సామాజిక రంగాల్లో వ్యయం చేస్తున్న మొత్తం ఇతర రాష్ట్రాలకంటే ఎక్కువగా ఉందని కాగ్ తెలిపింది. ఆరోగ్యం, విద్యలో మాత్రం వెనుకబడి ఉందంది.

రాష్ట్రాల కంటే తెలంగాణలో ఎక్కువగా ఉందని మాత్రం కితాబిచ్చింది. ఇది మెరుగైన దీర్ఘకాలిక ఆర్థిక నిర్వహణను సూచిస్తోందని పేర్కొంది.

తెలంగాణలోని పలుశాఖల పద్దులను విశ్లేషించిన 2016-17 కాగ్ నివేదికను శాసనసభ ముందుంచారు (ఈ నివేదికను చూపుతూ ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తుండటంతో.. కాగ్ విశ్లేషణపై ముఖ్యమంత్రి, కొందరు మంత్రులు అభ్యంతరాల్ని లేవనెత్తారు).

ఆరోగ్యం, విద్య, పురపాలన, ఎస్సీ, ఎస్టీ సంక్షేమం కోసం కేటాయిస్తున్న నిధుల్లో అత్యధికం వ్యయం కావడం లేదని కాగ్ స్పష్టంచేసింది. సరైన ఆర్థిక పద్ధతులు పాటించకుండా రెవెన్యూ మిగులు ఎక్కువ చేసి చూపారని, ఎఫ్ఆర్బీఎం నిర్దేశించిన పరిమితి కంటే లోటు ఎక్కువగా ఉందని తెలిపింది. 2016-17లో రూ.5,392 కోట్ల రెవెన్యూలోటు ఉండగా, రూ.1,386 కోట్ల మిగులుగా చూపారంది. రాష్ట్రానికి రుణాలు పెనుభారం కాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలంటూ.. రుణాల చెల్లింపునకు ఎక్కువ మొత్తం వ్యయం చేయాల్సి వస్తుందనే అంశాలను పరిగణలోకి తీసుకోవాలంది. ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధుల

## ఐటీఐఆర్ వైఫల్యం రాష్ట్రానిదే

రాష్ట్రంలో 68 లక్షల మందికి ఉపాధి కల్పించటంతోపాటు రూ.3,10,849 కోట్ల టర్నోవర్‌ను సాధిస్తుందన్న భారీ ఆశలతో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ (ఐటీఐఆర్)ను ప్రారంభించకపోవడం రాష్ట్ర ప్రభుత్వ లోపమేనని కాగ్ పేర్కొంది. ఐటీఐఆర్ నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వమే ముఖ్య పాత్ర పోషించాల్సి ఉందని గుర్తుచేసింది. ఈ ప్రాజెక్టును నిలిపివేశామని కేంద్రం ఎలాంటి ప్రకటన చేయకున్నా.. రాష్ట్ర ప్రభుత్వం దీన్ని ప్రారంభించకుండా నిర్లక్ష్యం వహించిందంది. ఇన్ఫోసిస్, విప్రో.. ఈ రెండు సంస్థల చేతుల్లో వృథాగా 388 ఎకరాల భూమి ఉందని తెలిపింది. రాష్ట్రంలో అమలవుతున్న వివిధ ఐటీ ప్రాజెక్టుల్లో ఉన్న లోపాలనూ కాగ్ కడిగేసింది.

- ఐటీఐఆర్‌కు రూ.2,19,440 కోట్ల పెట్టుబడులు వస్తాయని ఒక సలహాదారు రూపొందించిన నివేదిక అంచనా వేసింది. ఇవి సాధ్యపడని పెట్టుబడులు. సెమ్ ఇండియా ఫ్యాబ్, నానోటెక్ సిలికాన్, బ్రాహ్మణి ఇన్‌ఫ్రాటెక్ 24,928 కోట్ల పెట్టుబడులు పెడతాయని అంచనా వేయగా అవి విఫలమయ్యాయి. నానోటెక్ ఛైర్మన్ కనిపించకుండా పోయారు.
- ఐటీఐఆర్‌ను రెండు దశల్లో అభివృద్ధి చేయాలి. తొలిదశ 2018లో పూర్తికావాల్సి ఉంది. కానీ రాష్ట్ర ప్రభుత్వానికి బృహత్ ప్రణాళిక లేకపోవటంతో ఐటీఐఆర్ ప్రాంతాన్ని నోటిఫై చేసి స్థిరీకరించలేదు.
- ఐటీఐఆర్ కోసం ఎంఎంటీఎస్ ఎక్కడ వరకు ఉండాలన్న అంశంపై విమానాశ్రయ, రైల్వే అధికారుల సమన్వయలోపంతో ఎంఎంటీఎస్ పొడిగింపు ఆగిపోయింది. రేడియల్ రోడ్డు-8 పని కేంద్ర రవాణా శాఖ పరిధిలోకి రాని కారణంగా ఆగిపోయింది.
- ఐటీ పరిశ్రమలకు ఇవ్వాలనుకుంటున్న భూముల సమీపంలో కనీస వసతులు లేవు. ఇప్పటికే కేటాయించిన భూముల్లో మౌలిక వసతుల అభివృద్ధిని ఐటీ శాఖ పర్యవేక్షించడం లేదు.
- టీ-హబ్ రెండో దశ, ఇన్నోవేషన్ ఇన్ మల్టీమీడియా, యానిమేషన్, గేమింగ్, ఎంటర్‌టైన్‌మెంట్ (ఇమేజ్) భవనాల నిర్మాణానికి సలహాదారుల ఎంపికలో అక్రమాల కారణంగా రూ.16.70 కోట్ల అధిక భారం పడింది. ఒప్పందం తర్వాత చేసిన మార్పులతో నిర్మాణ సమయంలో టీ-హబ్ రెండోదశ నిర్మాణ సంస్థకు 13.11 కోట్ల అనుచిత ప్రయోజనం కలిగింది.
- ఇమేజ్ భవనం విషయంలో నియమితులైన ఒక సలహాదారుడిని తొలగించిన టీఎస్ఐఐసీ కొత్త సలహాదారుడిని నియమించింది. దీనివల్ల 15.11 కోట్ల అదనపు భారం పడింది.
- ట్రిపుల్‌ఐటీలోని టీ-హబ్ భవన పనులను డబ్ల్యూ డిజైన్ స్టూడియో ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు టెండరు లేకుండానే ఇచ్చారు. ప్రభుత్వ నిర్ణయం పక్షపాతానికి తావిస్తుంది.
- ప్రభుత్వం కేటాయించిన భూముల్లో ఐటీ సంస్థలు ఎలాంటి అభివృద్ధి చేయకుండానే అట్టిపెట్టుకున్నాయి. ఇన్ఫోసిస్ సంస్థకు 2007లో 446 ఎకరాలు కేటాయించగా 296 ఎకరాల్లో రెండు, మూడో దశల్లో ఎలాంటి అభివృద్ధీ చేయలేదు. 2007లో విప్రో సంస్థకు గోపన్నపల్లిలో కేటాయించిన 101 ఎకరాల్లో కేవలం 9 ఎకరాలను మాత్రమే ఉపయోగించింది.
- విప్రో రూ.450 కోట్ల పెట్టుబడి, 15 వేల మందికి ఉపాధిని కల్పిస్తామని దరఖాస్తులో ప్రతిపాదించింది. అయితే ఒప్పందంలో ఏపీఐఐసీ తక్కువ పెట్టుబడిని (100 కోట్లు), తక్కువ ఉద్యోగాలను (10 వేల మందికి) నిర్దేశించింది. అయినప్పటికీ విప్రో విఫలమైంది.

వ్యయానికి చట్టబద్ధత ఉన్నా, సగానికి సగం నిధులు వ్యయం కాలేదని వెల్లడించింది. సత్వర సాగునీటి ప్రయోజన పథకం కింద నిధులు వ్యయమైనా ఫలితాలు అందిరాలేదని చెప్పింది. మిషన్ కాకతీయలో మార్గదర్శకాల మేరకు పనులకు ప్రాధాన్యత ఇవ్వలేదని తెలిపింది. వివిధ శాఖల్లో రూ. వందల కోట్లు ఖర్చు చేయకపోవడం, పీడీ ఖాతాల్లో రూ.10,000 కోట్లు దాకా మూలుగుతుండటం, అదనపు వ్యయాల్ని ఆమోదించకపోవడం, నిబంధనలకు విరుద్ధంగా నిధుల వినియోగం వంటి లోపాలను కాగ్ స్పష్టంచేసింది.

### ఆయకట్టు స్థిరీకరణకు ఆధారాలు లేవు

మిషన్ కాకతీయ పథకం కింద తెలంగాణలో 5.6 లక్షల ఎకరాల గ్యాప్ ఆయకట్టును స్థిరీకరించినట్టు ప్రభుత్వం నివేదించినప్పటికీ, దీనిని బలపరిచే ఆధారాలేమీ లేవని కాగ్ పేర్కొంది. మొదటి రెండు దశల్లో ప్రాధాన్యతలేని పనులను కూడా చేపట్టిందని, అందువల్ల ఆశించిన విధంగా చెరువుల నిల్వ సామర్థ్యం పునరుద్ధరించినట్టు కూడా ధృవీకరించలేమని కాగ్ స్పష్టీకరించింది.

- మిషన్ కాకతీయ కింద ఐదేళ్లలో 46,531 చెరువులను పునరుద్ధరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2017 ఆగస్టు వరకు మూడు దశల్లో పనులు చేపట్టింది. తొలిదశ పనుల్లో మచ్చుకు తనిఖీ చేసిన 104 పనులకుగాను 69 పనుల్లో 20 నుంచి 549 రోజుల వరకు జాప్యం జరిగింది.
- మూడు దశల్లో చేపట్టిన పనుల్లో లక్ష్యానికి తగ్గట్టు 28 శాతమే నీటిపారుదల శాఖ పూర్తిచేయగలిగింది.
- చెరువుల పునరుద్ధరణలో పూడికతీత ప్రధానం. తీయాల్సిన పూడిక పరిమాణాన్ని అంచనా వేసేందుకు క్షేత్రస్థాయి అధికారులు పరిశీలించినట్టు రికార్డులేమీ లేవు. మచ్చుకు 27 పనులు తనిఖీ చేస్తే, ఇంజినీర్లు వేసిన పరిమాణం కన్నా తక్కువగా పూడికతీత జరిగింది.
- మెదక్, వికారాబాద్ డివిజన్లలో 100 శాతం ఆయకట్టును సాధించినట్టు ప్రభుత్వం ప్రకటించింది. అయితే 2017 జూన్ వరకు 936 పనులకుగాను 446 (47 శాతం) మాత్రమే పూర్తయినట్టు పరిశీలనతో తేలింది. కేంద్రం ఇస్తున్న నిధులను సకాలంలో ఖర్చు చేయకపోవటం వల్ల ప్రాజెక్టులు ఆలస్యమవుతూ వ్యయం పెరుగుతోంది.

పన్నుల వసూళ్లలో ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో వాణిజ్య పన్నుల శాఖ రూ.కోట్లలో రాబడి కోల్పోయిందని కాగ్ తేల్చింది. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) చెల్లింపులు, పన్ను రేట్ల వర్తింపు, మూసేసిన సంస్థలకు ప్రయోజనాలు సహా పలు కారణాలతో పన్ను రాబడికి నష్టం వాటిల్లింది. రాష్ట్రంలో 31 సంస్థలు మూసివేసినా పన్ను వాయిదా ప్రోత్సాహకాన్ని ఉపయోగించుకున్నాయి. వ్యవసాయేతర అవసరాల కోసం మార్పిడి చేసిన భూమి విషయంలో దాదాపు 2.04 కోట్లు తక్కువగా వసూలయ్యాయి.

### స్వయంఉపాధి పథకాలు అంతంతే

బలహీన వర్గాలకు మూడెకరాల భూమి పంపిణీ లోపభూయిష్టంగా ఉందని కాగ్ ఆక్షేపించింది. సాగుకు వీల్లేని, నీటివసతి అందుబాటులోలేని భూములను పంపిణీ చేసినట్టు గుర్తించింది. వాస్తవ విలువకన్నా ఎక్కువ ధరలకు వ్యవసాయానికి వీల్లేని భూములు కొనుగోలు చేశారని తెలిపింది. గత మూడేళ్లలో 12,587 మంది లబ్ధిదారులకు పంపిణీ లక్ష్యంగా పెట్టుకున్నా, 2,866 మందికి మాత్రమే ప్రయోజనం కల్పించారని పేర్కొంది. "వ్యవసాయ తదితర రంగాల్లో వయోపరిమితి వయస్సు దాటిన వారికి రుణాలు మంజూరు చేశారు. స్వయం ఉపాధి రుణంలో సబ్సిడీ నిధులు తీసివేయగా, మిగతా రుణమొత్తానికి బ్యాంకులు హామీ కింద కాలపరిమితితో కూడిన డిపాజిట్లు వసూలుచేయడంతో పేద లబ్ధిదారులు అధిక వడ్డీకి అప్పులు చేస్తున్నారు" అని కాగ్ తెలిపింది.

- కరీంనగర్‌లో భూపంపిణీకి తొమ్మిదిమంది లబ్ధిదారులను ఎంపిక చేయగా, ఆర్డీవో విచారణలో ఎనిమిదిమంది అనర్హులుగా తేలారు.
- సహకార సంస్థ అమలు చేసే పథకాలకు వార్షిక ప్రణాళికలు రాష్ట్రస్థాయిలో రూపొందించడం సరైంది కాదు. వార్షిక ప్రణాళికలను సిద్ధం చేసి ఆమోదించడంలో విపరీతమైన జాప్యం జరుగుతోంది. నిధుల ఖర్చు, సబ్సిడీల చెల్లింపు 50 శాతం కూడా దాటడం లేదు.
- సంక్షేమం, అభివృద్ధి లాంటి కీలక శాఖల్లో నిధుల వ్యయంపై ఉదాసీనత వ్యక్తమవుతోంది. గ్రాంటు, అప్రోప్రియేషన్‌లో కేటాయింపుల్లో 20 శాతం కంటే ఎక్కువ నిధులు మిగులుగా ఉంటున్నాయని కాగ్ ఆక్షేపించింది. దీనివల్ల ఆశించిన ఫలితాలు అందడంలేదని విశ్లేషించింది.

2016-17 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర స్థితిగతులు, ఆర్థిక రంగం, స్థానిక సంస్థలు, రెవెన్యూ రంగం, ప్రభుత్వరంగ సంస్థలు, సామాన్య-సామాజిక రంగాలకు నివేదికలను అందుబాటులోకి తెచ్చారు. జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకం నిధులు

## ఇసుక కొనుగోలుదారులకు అనుచిత లబ్ధి

విలువ ఆధారిత పన్ను చట్టంలో నిబంధనల్ని అమలుచేయడంలో ఖనిజాభివృద్ధి సంస్థ విఫలమైంది. దీంతో కొనుగోలుదారులకు అనుచిత లబ్ధి కలిగి ఖజానాకు నష్టం వాటిల్లింది.

## ఆస్తుల్ని కాపాడుకోలేకపోతున్న పంచాయతీలు

పంచాయతీరాజ్ సంస్థల పనితీరును కాగ్ ఎండగట్టింది. కనీసం సొంత ఆస్తుల్ని కాపాడుకోలేకపోతున్నాయని, అధికారుల పర్యవేక్షణ అసలే లేదని, మొక్కుబడి పాలన సాగుతోందని తెలిపింది.

◆ 2015-16తో పోల్చుకుంటే 2016-17లో పంచాయతీరాజ్ సంస్థల ఆదాయం రూ.1166.52 కోట్ల నుంచి 981.60 కోట్లకు తగ్గింది.

## టీఎస్ఐపాస్‌లో లోపాలు

తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక ప్రాజెక్టు ఆమోదం, స్వీయ ధృవీకరణ వ్యవస్థ (టీఎస్-ఐపాస్) చట్టం-2014 ప్రకారం పరిశ్రమల స్థాపనకు అన్ని శాఖల నుంచి ఒకేచోట అనుమతి ఇవ్వాల్సి ఉండగా, సాఫ్ట్‌వేర్‌లో తగిన నియంత్రణలు లేవని కాగ్ వెల్లడించింది. అనుమతి లభించనివారు మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా 'అప్లయ్ లేటర్' ఆప్షన్ లేదన్నారు. దరఖాస్తు చేసుకోవాల్సిన అనుమతులు 10,147 కాగా, దరఖాస్తు చేసినవి 3,223 అని వివరించింది.

## అధిక ధరలకు విద్యుత్ కొన్నారు

స్వల్పకాలిక అవసరాలకు టారిఫ్ ఆర్డర్‌లో ఆమోదించిన దానికంటే అధిక ధరకు ఎస్పీడీసీఎల్ విద్యుత్‌ను కొనుగోలు చేసిందని కాగ్ తెలిపింది. ఫలితంగా మూడేళ్లలో రూ.5,820 కోట్ల నష్టం వచ్చినట్టు వివరించింది. 2012లో యూనిట్ ధర రూ.4.17గా ఆమోదిస్తే, రూ.5.16కు, రూ.5.36కు కొనుగోలు చేశారని వెల్లడించింది. మీటర్లు లేకుండా కనెక్షన్లు ఇవ్వకూడదని టీఎస్ఈఆర్సీ స్పష్టమైన ఆదేశాలిచ్చినా, మీటర్లు పెట్టలేదని తెలిపింది. వ్యవసాయంలో విద్యుత్ వినియోగంపై కంపెనీలు ఇచ్చిన లెక్కలు నమ్మదగినవి కావని స్పష్టంచేసింది.

- ◆ ప్రభుత్వ శాఖలకు ప్రీపెయిడ్ మీటర్లు బిగించాలని ఆదేశాలిచ్చినా పట్టించుకోలేదు. కరెంటు బకాయిల్లో 58 శాతం ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక ప్రభుత్వాలకు చెందినవే.
- ◆ ఉదయ్ పథకం కింద 2017 జూన్ నాటికే 100 శాతం ట్రాన్స్‌ఫార్మర్లు, ఫీడర్లకు మీటర్లు బిగించాలని ఆదేశాలుండగా 56.57శాతం ట్రాన్స్‌ఫార్మర్లకే మీటర్లు పెట్టారు.

ఏ సంవత్సరమూ పూర్తిగా వ్యయం కాలేదని కాగ్ చెప్పింది. రాష్ట్రంలో సిజేరియన్‌లు జాతీయ సగటుకన్నా ఎక్కువగా ఉన్నాయని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని వివరించింది. నిర్బంధ విద్యాహక్కు చట్టం అమల్లోకి వచ్చినా బడి మానేస్తున్న పిల్లల సంఖ్య ఎక్కువగా ఉందని, ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ బాలబాలికల్లో ఇది ఎక్కువగా ఉందని తెలిపింది. క్రీడారంగానికి నామమాత్రపు నిధులే దక్కుతున్నాయని తెలిపింది. రాష్ట్రంలో అగ్నిమాపక కేంద్రాల కొరత తీవ్రంగా ఉందని పేర్కొంది. పన్నురాబడులపై ఉదాసీనత వల్ల కోట్ల రూపాయల రాబడులకు గండి పడుతోందని తెలిపింది. ఐటీ, ఇతర పరిశ్రమలకు కేటాయించిన భూములు నిరుపయోగంగా ఉన్నాయని, కొన్ని పాక్షికంగా ఉపయోగిస్తున్నారని, నిర్ణీత సమయంలో వినియోగం దిశగా వీటిపై పర్యవేక్షణ లేదంది. ఎస్పీడీసీఎల్ రాష్ట్ర విద్యుత్ నియంత్రణా మండలి విధించిన గరిష్ఠ సీలింగ్ పరిమితికన్నా ఎక్కువ ధరలకు విద్యుత్ కొనడం వల్ల 2012-17 మధ్యకాలంలో రూ.5820 కోట్లు అధికంగా వ్యయమైందని తేల్చింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బస్టాండ్లలో స్టాళ్ల నిర్వహణ పట్ల అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆర్టీసీకి నష్టం వాటిల్లిందని తెలిపింది. ఆరు ప్రభుత్వరంగ సంస్థలు నష్టాలతో సతమతమవుతున్నాయంది. ❍



# అశోకుడి కాలం కంటే వెనకబడిన నేటి పాలకులు

హేతుబద్ధంగా, శాస్త్రీయంగా ఆలోచించటంలో అశోకుడి కాలంనాటి కంటే మన ప్రస్తుత పాలకులు వెనకబడి ఉన్నారని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ అన్నారు. సమాజ శ్రేయస్సు కోసం సహేతుకంగా ఆలోచించి మౌలిక వసతుల్ని కల్పించిన మొట్టమొదటి చక్రవర్తి అశోకుడని, ఆధునిక ప్రజాస్వామ్య ప్రభుత్వాలుగా భారతదేశాన్ని, రాష్ట్రాల్ని ఏలుతున్నవారికి మాత్రం.. మౌలికవసతులు కల్పించటం తమ బాధ్యత అన్న స్పృహ కూడా లేదని అన్నారు. ఇరవయ్యొకటో శతాబ్దంలో ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ప్రజలకు ఏం చేయాలి అన్న స్పష్టత కరవైన పాలకుల వల్లే దేశంలో అన్నీ ఉన్నా దుర్రాజ్యం నడుస్తోందన్నారు. నివారించదగ్గ కష్టాలతో కన్నీళ్లతో కోట్లాదిమంది నలిగిపోతున్నారని, వివక్షకు గురై ఎదిగే అవకాశాలను అందుకోలేకపోతున్నారని అన్నారు.

జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా గూడూరు పట్టణంలోని దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాల విద్యార్థులతో జయప్రకాష్ నారాయణ్ చర్చా కార్యక్రమం నిర్వహించారు. ప్రజా సైన్స్ వేదిక కార్యక్రమాన్ని సమన్వయం చేసింది.

ప్రభుత్వం ఎంత ఖర్చు చేస్తోందీ, ఆ డబ్బు ఎవరిది అనే ప్రశ్నలతో జేపీ చర్చను ప్రారంభించారు. విద్యార్థినులు సమాధానం చెప్పలేక సంకోచిస్తుండగా.. సుమారుగా మీరు అనుకునే అంకెల్ని చెప్పండి అని ప్రోత్సహించారు. కొన్ని వందల కోట్లను ఖర్చు చేస్తుందని విద్యార్థినులు అభిప్రాయపడ్డారు. రోజుకు ప్రభుత్వాలు మన పేరు మీద అన్ని రకాలుగా రూ. 11,000కోట్లు ఖర్చు చేస్తున్నాయి అని చెప్పగానే ఆశ్చర్యంగా చూశారు.

ఈ డబ్బంతా ఎవరిది అన్న ప్రశ్నకు మాత్రం వెంటనే సమాధానమిచ్చారు. 'మనం కట్టే పన్నుల డబ్బే'నని తేల్చిచెప్పారు.

మరి మన డబ్బును మనం ఏర్పాటు చేసుకున్న ప్రభుత్వాలు సక్రమంగా ఖర్చు చేస్తున్నారో లేదో మనం తనఖీ చేసుకుంటున్నామా? అన్న ప్రశ్నకు మాత్రం సమావేశంలో మౌనమే సమాధానమైంది.

"ఇంట్లో మీ అమ్మ వంకాయలు తెమ్మని పురమాయించిందనుకోండి. మీరు వెయ్యి రూపాయలు పెట్టి ఓ కిలో వంకాయలు తెచ్చారనుకోండి. అమ్మ ఊరుకుంటుందా?" అని జేపీ తన ప్రశ్నల్ని కొనసాగించారు.

ఊరుకోదు.

ఏ కూరగాయలు ఎలా ఉన్నాయి, ఎంత తక్కువ ధరకు ఇస్తారు? అని ఆలోచించి మనం కొనకపోతే అమ్మ దుడ్డుకర్ర పట్టుకుంటుంది. అంత జాగ్రత్తగా మనకు సంబంధించిన డబ్బును ఖర్చు చేయటాన్ని మనం ఇంటి నుంచీ నేర్చుకుంటుంటాం. మరి ఒక్కరోజుకే ఇన్ని వేలకోట్ల మన డబ్బును ప్రభుత్వాలు ఖర్చు చేస్తుంటే.. సరైన పనులకు ఖర్చు చేస్తున్నారా? లేదా? ఎక్కడ తప్పు జరుగుతోంది? తప్పుల్ని ఎలా సరిచేయాలి? అని ఆలోచించమా? అని జేపీ అడిగారు.

ఆలోచించాల్సిందే అన్న సమాధానానికి కీలకమైన ప్రశ్నను జేపీ జోడించారు.

మనకు కావలసిన ఏ పనులు చేయడానికి ప్రభుత్వం డబ్బును ఖర్చు చేయాలి? అని అడిగారు.

దీనికి సమాధానంగా నాయకులు, వ్యక్తిగత అవసరాలకు సంబంధించిన సమాధానాలు వచ్చాయి.

''మనం రాజ్యవ్యవస్థను ఏర్పాటు చేసుకున్నది కొందరు వ్యక్తులు, నాయకుల కోసం కాదు. మనందరి ఉమ్మడి అవసరాలు.. మనంతట మనమే చేసుకోలేని పనులు చేసి పెట్టడానికి రాజ్య వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నాం. పార్టీలు, నేతలు.. ఇలాంటివన్నీ ఇందుకోసమే. ఎన్నికలు జరిగేది, మనం ఓటు వేసేది ఇందుకోసమే. కానీ మనం ఎన్నికలు, పార్టీల మధ్య చిక్కుకుపోయి.. ఎన్నికకి-ఎన్నికకి మధ్య జరగాల్సిన అసలు పనుల గురించి మర్చిపోయాం. ఎవరు ఎన్నికైనా మన సమస్యలు పరిష్కారం కావటం లేదని ఆవేదన చెందున్నాం. ప్రభుత్వం ఏం

## ఒకరు నిరుద్యోగ భృతి, ఇంకొకరు 45 ఏళ్లకే పెన్షన్

నిరుద్యోగ భృతి కోసం పిల్లల్ని కనండి అని ముఖ్యమంత్రి అంటుంటే, తాను అధికారంలోకి వస్తే 45 ఏళ్లకే పింఛను ఇస్తానని ప్రతిపక్ష నేత అంటున్నారని.. యువతను నిర్వీర్యం చేసేందుకు, ప్రజల్ని బిచ్చగాళ్లను చేసేందుకు చేస్తున్న ఈ పోటాపోటీ తాయిలాల రాజకీయం పట్ల అప్రమత్తంగా ఉండాలని జేపీ సూచించారు.

చేయాలో తెలుసుకుని, సరిగా పనిచేయించుకుంటేనే ఎన్నికలకు అర్థం, పరమార్థం. ఇప్పుడు చెప్పండి.. ప్రభుత్వాలు ఏం చేయాలి?" అని జేపీ మళ్లీ అడిగారు.

ఈసారి కూడా సంతృప్తికర సమాధానం రాకపోవడంతో జేపీయే సమాధానమిచ్చారు.

"ప్రభుత్వాలు మనకు చట్టబద్ధ పాలన అందించాలి. ఎవరో బడితె పట్టుకుని మన మీద దాడులు చేయకుండా రక్షించే ఏర్పాటు చేయాలి. రోడ్లు, విద్యుత్తు, ఇతరత్రా మౌలిక వసతుల్ని కల్పించాలి. సంపన్నులు తమ కోసం విద్యుత్ ప్లాంట్‌ను నిర్మించుకోలేరు. రోడ్లు వేసుకోలేరు. అలాగే అందరికీ ఎదిగే అవకాశాల కోసం మంచి విద్య, ఆరోగ్యం అందించాలి. ప్రజలు దోపిడీకి గురికాకుండా న్యాయంగా బతకగలిగే ఏర్పాటు చేయాలి. ఈ పనులు మన ప్రభుత్వాలు ఎంత మేర చేస్తున్నాయి? సరిగా చేస్తున్నాయా?" అని ప్రశ్నించారు.

లేదు అని ముక్తకంఠంతో సమాధానం!

చట్టబద్ధపాలనకు ఎన్ని మార్కులిస్తారు? అంటే.. సున్నా నుంచి మొదలు పెట్టారు.

ఇది మరీ అన్యాయం. మనం ఎంతోకొంత స్వేచ్ఛగా తిరగలుగుతన్నామంటే చట్టబద్ధపాలన ఉన్నట్టేగా అని జేపీ తిరిగి ప్రశ్నించారు. చివరికి 50 మార్కులు ఇద్దామనుకున్నారు. అయితే.. ఈ మార్కుల్లో ప్రభుత్వానికి వచ్చేది 20 మాత్రమేనని జేపీ స్పష్టం చేశారు. మన రాష్ట్రంలో, దేశంలో చట్టబద్ధపాలన ఉందీ అంటే దానికి క్రెడిట్ మన సమాజంలోని కట్టుబాట్లు, కుటుంబ వ్యవస్థదని, ప్రభుత్వం పాత్ర తక్కువని అన్నారు. కానీ ఉన్నకొద్దీ ఈ వెసులుబాటు తగ్గిపోతోందని, పట్టణీకరణ పెరుగుతుండటం వల్ల కట్టుబాట్లు, కుటుంబ వ్యవస్థ పాత్ర సామాజికంగా బలహీనపడుతోందని, ప్రభుత్వం చట్టబద్ధపాలనను బలపరిచే ఏర్పాట్లను చేయకపోతే ముమ్ముందు శాంతిభద్రతలు, రక్షణ కూడా ప్రమాదకరంగా మారే పరిస్థితి ఉందని వివరించారు.

అలాగే విద్య, ఆరోగ్యం, ఇతరత్రా రంగాల్లో కూడా 20కంటే తక్కువ మార్కులే ప్రభుత్వానికి పడ్డాయి.

మనందరం ఏ ఉమ్మడి అవసరాలకోసమైతే రాజ్యవ్యవస్థని, ప్రభుత్వాల్ని ఏర్పాటు చేసుకున్నామో, ఆ అవసరాల్లో మన డబ్బులను ఖర్చు చేస్తూ కూడా కనీసం పాస్‌మార్కులు సంపాదించుకోకుండానే దశాబ్దాలు గడిచిపోతుంటే.. భారతదేశం ఎప్పటికీ అభివృద్ధి చెందుతున్న దేశంగానే ఉంటుంది తప్ప, ఎప్పటికీ అభివృద్ధి చెందదని జేపీ స్పష్టం చేశారు. రాబోయే తరాలు ముందు తరాల కన్నా మెరుగైన జీవితాల్ని గడపాలని, కానీ మనదేశంలో దుర్రాజ్యం వల్ల రాబోయే తరాల పరిస్థితి మరింత అధ్వాన్నంగా తయారయ్యేలా ఉందని అన్నారు. దీన్ని మార్చడం కోసమే సురాజ్య యాత్రను చేపట్టామన్నారు.


కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ జానపద కళాకారిణి, ప్రజా సైన్సు వేదిక ప్రతినిధి లీలమ్మ పాడిన గురజాడ గీతాన్ని జేపీ ప్రస్తావిస్తూ, దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్ అని గుర్తిస్తే.. దేశనిర్మాణంలో ప్రజల్ని భాగస్వామ్యుల్ని చేసేందుకు సురాజ్య ఎజెండా ఎంత అవసరమో ఇట్టే అర్థమవుతుందన్నారు. ప్రజలు బాగుపడకుండా దేశనిర్మాణమనేదే ఉండదన్నారు.

సురాజ్యం రాకపోయినా తమ తరానికి పెద్దగా తేడా ఏమీ ఉండదని, సమాజంలో అవసరమైనవన్నీ తాము పొందామని, కానీ యువతరానికి మాత్రం చాలా సవాళ్లు ఎదురవుతాయని జేపీ అన్నారు. సురాజ్యం రాకపోతే నష్టపోయేది మీరే, వస్తే లాభపడేదీ మీరే అని జేపీ విద్యార్థులనుద్దేశించి అన్నారు.

ఒక్క వైద్యరంగంలో మినహా సురాజ్య ఎజెండాలోని మిగతా అంశాలన్నిటికీ డబ్బు కూడా ఖర్చు చేయనక్కర్లేదని జేపీ అన్నారు. కొన్ని పద్ధతుల్ని మారిస్తే చాలన్నారు. వైద్యంలో కొంత అదనంగా డబ్బును ఖర్చు చేయటంతోపాటు పద్ధతుల్ని కూడా మార్చాలన్నారు. యువత తమ కెరీర్‌ను, జీవితాల్ని చూసుకుంటూనే స్థానికంగా తమ చుట్టూ ఉన్న చిన్న సమస్యలపై తెలిగ్గా పోరాటం చేసేలా, పెద్ద ఫలితాలను సాధించేలా సురాజ్య కార్యక్రమాలను రూపొందించామన్నారు. యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్‌లలో నమోదై సలహాలు, సూచనలు అందించాలని, సురాజ్య కార్యకలాపాల్లో భాగస్వాములు కావాలని యువత, ఇతర పౌరులకు విజ్ఞప్తి చేశారు.

డీఆర్‌డబ్ల్యూ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ సీఆర్‌రెడ్డి, ప్రిన్సిపల్స్ రేవతీదేవి, పద్మావతి, వైస్ ప్రిన్సిపల్ భారతలక్ష్మి, డాక్టర్ రోహిణి, ప్రజా సైన్స్ వేదిక ప్రతినిధులు ఫిరోజ్‌బేగ్, నారాయణ, మాల్యాద్రి, అంజిరెడ్డి, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, మీరా మొహియుద్దీన్, లోక్‌సత్తా ప్రతినిధులు బండారు రామ్మోహనరావు, మాచిరాజు, బాలసుబ్రహ్మణ్యం, వైబీఐ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ❍

# చిన్న పట్టణాల అభివృద్ధితోనే ఉపాధి



చిన్న పట్టణాలను అభివృద్ధి చేసి స్థానికంగా అధికారాలను, జనాభాను బట్టి నిధులను అందుబాటులో ఉంచితేనే అన్ని ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలకు ఊపు వస్తుందని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ అన్నారు.

సురాజ్య యాత్రలో భాగంగా ప్రకాశం జిల్లా చీమకుర్తిలో వివిధ వర్గాల ప్రజల్ని జేపీ పలకరించారు. పలు సమావేశాల్లో పాల్గొన్నారు.


చీమకుర్తి కంటి ఆస్పత్రి ఆవరణలోని లయన్స్ అంధుల పాఠశాల, ఎస్.కె.ఆర్ బధిరుల పాఠశాల, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలను సందర్శించిన అనంతరం జేపీ మాట్లాడుతూ, గ్రానైట్ రాయల్టీ నిధులు వస్తే చీమకుర్తిలో పెద్దఎత్తున అభివృద్ధికి అవకాశం ఉంటుందన్నారు. ఈ ప్రాంతంలో దోమల బెడద తీవ్రంగా ఉందని, తాను బస చేసిన చోట అర్ధరాత్రి కరెంటు పోవటంతో దోమలతో తీవ్ర ఇబ్బందులు పడ్డానని అన్నారు. దోమల నివారణ, సాధారణ పారిశుధ్యం కోసం కూడా పైస్థాయి అధికారులు, నేతల చుట్టూ తిరగాల్సి రావటం వల్ల అనేక మునిసిపల్ వార్డులు, పంచాయతీల్లో ప్రజలు నిత్యం సమస్యల్ని ఎదుర్కొంటున్నారన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రాలకు పన్నుల డబ్బులో మూడింట రెండొంతులు వస్తోందని, కానీ రాష్ట్రం నుంచి స్థానిక ప్రభుత్వాలైన పంచాయతీలు, మునిసిపాలిటీలకు రాకపోవడం వల్ల ఆరోగ్యం, విద్య సహా పలు అవకాశాల్ని ప్రజలు కోల్పోతున్నారన్నారు. గ్రామాల నుంచి వలసలు పోయినా బతుకు మారటం లేదన్నారు. అందుకే కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చే నిధుల్లో సగం స్థానిక ప్రభుత్వాలకు వస్తే చీమకుర్తి వంటి చోట్ల అభివృద్ధి పరుగులు పెడుతుందని, ప్రజల జీవనప్రమాణాలు పెరుగుతాయని అన్నారు. దీనికితోడు స్థానికంగా వనరుల నుంచి ఆదాయం వస్తే మరింత దన్ను లభిస్తుందన్నారు. ఈ ప్రాంతంలో వ్యవసాయాధారిత పరిశ్రమలతో చిన్న పట్టణాలను అభివృద్ధి చేసి సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడిస్తే ప్రజలకు కనీస ఆదాయం సమకూరి బతుకుభారం కాకుండా ఉంటుందన్నారు.

ప్రభుత్వాలు వికేంద్రీకరణతోపాటు విద్యారంగంపై గట్టి దృష్టి సారించాలని జేపీ అన్నారు. చదువులు తెలివిని సానబట్టే సాధనంగా ఉండాలన్నారు. విద్యార్థులు చదువుతోపాటు చుట్టూ ఉన్న సమాజంలోని విషయాలపై కూడా అవగాహనను, నైపుణ్యాల్ని పెంచుకోవాలన్నారు. ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. పరిష్కారంలో భాగమవటం, సంస్కరించుకోవటం విద్యార్థి దశ నుంచే మొదలవ్వాలన్నారు. అంగవైకల్యంతో పుట్టకుండా గర్భస్థ దశ నుంచీ నివారణా చర్యలకు లోక్‌సత్తా గట్టి కృషి చేసిందన్నారు. వైద్యరంగంలో లోక్‌సత్తా ప్రతిపాదనలు సమగ్రంగా అమల్లోకి వస్తే దివ్యాంగులకూ ఎంతో మేలు జరుగుతుందన్నారు.

జనవిజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షుడు డాక్టర్ బి.జవహర్, ప్రజా సైన్స్ వేదిక అధ్యక్షుడు సీఏ ప్రసాద్, ఛైర్మన్ కొత్రపు రాఘవరావు, లయన్స్ క్లబ్ జోనల్ ఛైర్మన్లు చలువాది బదిరీనారాయణ, నూనె సుబ్రహ్మణ్యం, అధ్యక్ష, కార్యదర్శులు శిద్దా కాశీవిశ్వేశ్వరరావు, చలువాది రమేష్, గెలాక్సీ క్లబ్ అధ్యక్షుడు షేక్ ఖయ్యూంబాషా, ప్రధానాచార్యులు కృష్ణారెడ్డి, లోక్‌సత్తా నేతలు బండారు రామ్మోహనరావు, డాక్టర్ రాధాదేవి, శివరమేష్‌రెడ్డి, వైబీఐ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ❍

# కార్పొరేట్లకు దోచిపెడుతున్న ఎన్టీఆర్ వైద్యసేవ

## పనికిమాలిన రంగాల్లో ఉద్యోగాలకు భారీ జీతాలు, డిమాండ్ ఉన్న ప్రజారోగ్యానికి అరకొర నిధులా?



పనికిమాలిన ప్రభుత్వ సేవలు చేస్తున్నవారికి లక్షల్లో జీతాలిస్తున్న ప్రభుత్వం.. ప్రజలకు ప్రాణ సేవలందించే ఆరోగ్యరంగంలో పనిచేసే సిబ్బందికి మాత్రం అరకొరగా జీతాలిస్తోందని జేపీ అన్నారు. ఎక్కడ ప్రజలకు ఎక్కువ ఉపయోగం, డిమాండ్ ఉందో అక్కడ ఎక్కువ ఖర్చు చేస్తారా? ప్రజలకు పెద్దగా అవసరం లేకపోయినా కోట్లు దుబారా చేస్తారా?.. దీనికేమీ పెద్ద తెలివితేటలు అక్కర్లేదు, ప్రజారోగ్యం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని అర్థం చేసుకోవటానికి ఇంగితజ్ఞానం ఉంటే చాలు అన్నారు.

నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిని సురాజ్య యాత్రలో భాగంగా జేపీ సందర్శించారు. నిధుల వినియోగం, సౌకర్యాలపై వైద్యులు, వైద్యాధికారులతో చర్చించిన అనంతరం వార్డులను సందర్శించి రోగులతో మాట్లాడారు.

దాదాపు రూ. 200 కోట్ల విలువైన సేవలను అందిస్తున్న ఈ ఆస్పత్రికి ప్రభుత్వం కేవలం రూ. 28 కోట్లు కేటాయిస్తోందని జేపీ అన్నారు. 120 మంది ఔట్‌పేషెంట్లను చూస్తూ 10 సర్జరీల్లో డాక్టర్ పాల్గంటున్నారని, వీరికిచ్చే జీతభత్యాలు రూ. 50వేల లోపేనని అన్నారు. ప్రపంచంలోనే మరెక్కడా లేనంత సంక్లిష్టంగా మనదేశంలో వైద్యరంగ చదువుల్ని తయారుచేశామని, మిగిలిన దేశాలకు భిన్నంగా మన వద్ద ఎంబీబీఎస్ చదివినవారు పోస్టు గ్రాడ్యుయేషన్ చేయటాన్ని పెద్ద గందరగోళంగా మార్చేశామని అన్నారు. ఇంత కష్టపడి ప్రాణాలను నిలబెట్టే నైపుణ్యాన్ని సంతరించుకున్నవారికి రూ. 40-50వేలు జీతాలిస్తే మెరుగైన సేవలు ఎలా అందుతాయని ప్రశ్నించారు. ఇలాగైతే వచ్చే పదేళ్లలో ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులే మిగలరని ఘంటాపథంగా చెప్పవచ్చన్నారు. ఆస్పత్రిలోని నర్సులకు సరైన జీతభత్యాలు, ప్రసూతి సెలవులు వంటివి కూడా లేవని, ఏఎన్ఎంల పోస్టులు ఖాళీగా ఉన్నాయని అన్నారు. ఈ పోస్టుల్ని భర్తీ చేయడంతోపాటు వీరి ఆరోగ్యానికి కూడా భద్రత కల్పించే ఏర్పాట్లు చేయాలన్నారు.

ఫైవ్‌స్టార్ హోటళ్ల తరహాలో నిర్మించిన ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఆ ఖర్చుకు తగ్గట్టే బిల్లుల్ని వసూలు చేస్తారని, వారి బిల్లుల్ని చెల్లించేందుకు ఎన్టీఆర్ ఆరోగ్యసేవ వంటి పథకాలను అమలు చేస్తున్నారు గానీ, సామాన్య, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు శక్తికి మించి ప్రయత్నిస్తున్న ప్రభుత్వాస్పత్రుల్ని మాత్రం నీరుగారుస్తున్నారని అన్నారు. జాతీయస్థాయిలో కూడా ప్రభుత్వం వైద్యానికి అతి తక్కువగా జాతీయా దాయంలో 1.1శాతాన్నే కేటా యిస్తోందని, అది కూడా ఫలితాలులేని రీతిలో వృథా చేస్తోందని అన్నారు. మిగతా దేశాల్లో వైద్యానికి 8-9శాతం కేటాయిస్తున్నారన్నారు. వైద్యరంగంలో నిర్లక్ష్యం వల్ల ఐదేళ్లలోపు పిల్లల్లో 12లక్షల మంది ఏటా మరణి స్తున్నారని, ఆరు కోట్లమంది పేదలుగా మారి పోతున్నారని అన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవల పేరుతో ప్రభుత్వ బడ్జెట్ నంతా ప్రైవేటు ఆస్పత్రులకు దోచిపెట్టగం సరికాదని, ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులకు మెరుగైన జీత భత్యాలు, వసతుల కల్పన చేయాలని అన్నారు. ప్రభుత్వం వైద్యవిధానాన్ని పునస్సమీక్షించి సరైన విధానాలను అనుసరిస్తే, ఎన్టీఆర్ వైద్య సేవల పథకానికిస్తున్న రూ. 1500-2000 కోట్లతోనే అందరికీ మంచి వైద్యాన్ని అందించ వచ్చన్నారు.

ఆస్పత్రి ఇంఛార్జి సూపరింటెం డెంట్ శ్రీనివాసులు, ఆర్ఎంవో వర ప్రసాద్, పరిపాలనాధికారి కళారాణి, లోక్‌సత్తా, వైబీఐ నేతలు పాల్గొన్నారు. ❍

# పరిష్కారాలను వెదకటం విద్యార్థి దశ నుంచే మొదలవ్వాలి



ఎన్నికల రాజకీయాల్లో ఉన్నా లేకపోయినా, సామాజిక రాజకీయాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వామి కావాలని, సామాజిక విలువలకు ఉపాధ్యాయులే పునాది అని జేపీ అన్నారు. ట్రైనీ టీచర్లు శిక్షణ పొందే సమయం నుంచీ అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఒంగోలు సంతనూతలపాడు నియోజకవర్గం మైనంపాడులోని డైట్ కళాశాలలో శిక్షణ పొందుతున్న టీచర్లతో సురాజ్య యాత్రలో భాగంగా జేపీ ముఖాముఖి చర్చలో పాల్గన్నారు.

సామాజిక నిర్మాణం ఎలా ఉంటే బాగుంటుందో ట్రైనీలనడిగి జేపీ వివరాలు రాబట్టారు. ప్రజాస్వామ్యంలో ప్రజల నుంచి రహస్యంగా సమాచారాన్ని దాచాలని పాలకులు అనుకోవడం సహించరానిదని, పారదర్శకతను పెంపొందించేందుకే సమాచార హక్కును కొందరు మిత్రులతో కలిసి లోక్‌సత్తా సాధించిందని వివరించారు. ఈ చట్టం వచ్చాకైనా అడగాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం సమాచారాన్ని అందిస్తుందనుకుంటే.. చట్టాన్ని తుంగలో తొక్కడానికి ఎప్పటికప్పుడు కొత్త మార్గాల్ని అన్వేషిస్తోందన్నారు. అందుకే సహ చట్టంలో కొన్ని మార్పులు చేయాల్సి ఉందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు, వేధింపులు లేకుండా, దేబిరింపులు అవసరం లేకుండా ప్రజలకు రోజువారీ పనులు జరిగేందుకు లోక్‌సత్తా ప్రతిపాదిస్తున్న పౌర సేవల చట్టం ఇంకా విప్లవాత్మకమైనదని, దీన్ని పక్కనపెట్టి ఉద్యోగస్వామ్యాన్ని అమలుచేస్తూ కేంద్రీకృత పాలనను చెలాయించాలని పాలకులు ప్రయత్నిస్తున్నారని అన్నారు. దేశంలో, రాష్ట్రంలో విద్య పేరుతో ఒక్కో విద్యార్థి మీదా వేల రూపాయలు ఖర్చు చేస్తున్నా, సరైన చదువు రావడం లేదని, అందువల్లే పారదర్శకత, లంచాల్లేని సేవలు వంటి కనీస ప్రజాస్వామిక అవసరాల్ని కూడా డిమాండ్ చేయలేకపోతున్నారని అన్నారు. మెరుగైన ప్రైవేటు పాఠశాలలో ఏడాదికి రూ. 40వేలు ఫీజుగా తీసుకుంటుంటే, ఏపీ ప్రభుత్వం విద్యార్థికి రూ. 60వేలు వెచ్చిస్తూ కూడా చదువు అందేలా చేయలేకపోతోందన్నారు. సమస్యల వర్ణన, ఉద్రేకంతో ఓటు వేసి ఆ వెంటనే నువ్వు దిగిపో అంటూ అరవటం దశ నుంచి స్పష్టమైన అవగాహనతో పరిష్కారాల్ని సాధించేదశకు దేశ ప్రజలు ఎదగాలన్నారు. ఇందుకు పునాది విద్యార్థి దశలోనే పడాలన్నారు. ఈ ఏర్పాట్లన్నీ జరిగితేనే సుస్థిరాభివృద్ధిని సాధించే సామాజిక నిర్మాణం రూపుదిద్దుకుంటుందన్నారు. ప్రతి ఒక్కరి మెదళ్లలో అలాంటి దృక్పథాన్ని, అవగాహనను తీసుకురావటమే నిజమైన విప్లవమన్నారు. అందుకే సురాజ్య యాత్రన్నారు. ప్రజలను సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా తలెత్తుకుని బతికే వారిగా రూపొందించే ఆరు లక్ష్యాలను సాధించటం సురాజ్య యాత్ర ధ్యేయమన్నారు. నాణ్యమైన విద్య, ఆరోగ్యం, లంచాల్లేని పౌరసేవలు, స్థానిక ప్రభుత్వాల సాధికారత, చట్టబద్ధపాలన, వ్యవసాయంలో ఆదాయం అనే ఆ ఆరు లక్ష్యాల్లో పెద్దగా ఖర్చులేని, వెంటనే అమలు చేయగల మార్పులను సురాజ్య యాత్ర ప్రతిపాదిస్తోందన్నారు. వీటిని అందిపుచ్చుకుని మార్పును సాధించటంలో ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలన్నారు.

సమాజంలో తమ చుట్టూ ఉన్న చిన్న సమస్యలను పరిష్కరించుకునే శక్తిని విద్యార్థులు, యువత, ఉపాధ్యాయులు, ఇతర పౌరులకు అందించేందుకే సురాజ్య ప్లాట్‌ఫారాలుగా యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్‌లను అందుబాటులోకి తెచ్చామని జేపీ అన్నారు. వీటిని పూర్తిగా వినియోగించుకోవాలన్నారు.

అనంతరం డైట్ ఆవరణలో ఒక మొక్కను జేపీ నాటారు. ఆయనతో సెల్ఫీలు దిగేందుకు ఛాత్రోపాధ్యాయులు పోటీపడ్డారు.

కార్యక్రమంలో ఇంఛార్జి ప్రిన్సిపల్ పి.వి శేషుబాబు, శాంతివనం అధ్యక్షుడు డాక్టర్ సుధాకర్, జేవీవీ రాష్ట్ర నాయకులు, డాక్టర్ రాధాదేవి,

## 80శాతం మంది తెలివితేటలు ఇంకిపోతున్నాయి

వివక్ష వల్ల చదువు అందక కొన్ని శతాబ్దాలపాటు, సరైన చదువు అందక ఈ ఆధునిక యుగంలో.. మనదేశంలో 80శాతంమంది యువత తెలివితేటలు వికసించకుండానే ఇంకిపోతున్నాయని జేపీ ఆవేదన వ్యక్తం చేశారు. సమాజం విద్యను గౌరవిస్తోంది, అభినందిస్తోందిగానీ.. విద్య గొప్పతనాన్ని గుర్తించడం లేదన్నారు. 1960లలో ఉపాధ్యాయులకు సరైన జీతాల్లేవుగానీ మంచి విద్యావ్యవస్థ ఉండేదన్నారు. ఇప్పుడు ప్రభుత్వ స్కూల్‌లో ఒక్కో విద్యార్థి మీదా రూ.60వేలు ఖర్చు చేస్తున్నా సరైన చదువు రావటం లేదన్నారు. ఉపాధ్యాయుడు ఉద్యోగిగా మారాడన్నారు. కొన్ని ప్రైవేటు కళాశాలలు మార్కుల కోసం మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తూ విద్యావ్యవస్థను నాశనం చేస్తున్నాయన్నారు. విద్యార్థులకు అర్థం లేని లక్ష్యాలను నిర్దేశిస్తున్నాయన్నారు. విద్యార్థులను విద్యాసంపద సృష్టించేవారిగా తయారు చేయాలని ట్రైనీ టీచర్లకు జేపీ పిలుపునిచ్చారు. మనల్ని మనం సంస్కరించుకుని సమాజంలో మంచి మార్పునకు నాంది పలకాలన్నారు. ఆధునిక సమాజ నిర్మాణంలో ప్రతి విద్యార్థీ భాగస్వామి అయ్యేలా తల్లిదండ్రులు ఆలోచించాలని కోరారు.

## పార్టీలు చేయకపోతే మనమే పునాదులు వేసుకుందాం

మంచి సమాజ నిర్మాణం కోసం రాజకీయ పార్టీలు, వనరులున్న శక్తులు పనిచేయకపోతే మనమే నిర్మించుకుందామని, ఇందుకు రాజ్యాంగం తగినన్ని హక్కుల్ని, అవకాశాల్ని కల్పించిందని జేపీ అన్నారు.

జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా ఒంగోలు సంతపేట దామచర్ల సక్కుబాయి ఆవరణలో ఉన్న సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతిగృహాన్ని జయప్రకాష్ నారాయణ్ సందర్శించారు.

విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు జేపీ జవాబిస్తూ, మంచి సమాజ నిర్మాణానికి ఎలా పనిచేద్దాం అని ప్రశ్నించారు. సమాజ నిర్మాణానికి కొన్ని సాధనాలు, వేదికలు కావాలని, సాంకేతిక యుగంలో ఏ మూలనున్నా వాటిలో భాగస్వాములు కావటం తేలికని అన్నారు. గాంధీజీ వంటి దార్శనికుల కలలు నెరవేర్చడానికి మనమే సాంకేతికత సాయంతో సాధనంగా మారదామన్నారు. బట్టీ పట్టకుండా, సమస్యలకు భిన్న పరిష్కారాలను ఆలోచించటం అలవరచుకుంటే తాను చెప్పే విషయాలు చాలా తేలికగా విద్యార్థుల జీవితాల్లో భాగంగా మారిపోతాయన్నారు. మీ చదువుల్ని, ఇతర పనుల్ని మానుకోకుండానే సమాజంలోని సమస్యల పరిష్కారంలో భాగమయ్యేందుకు యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్‌లో నమోదు చేసుకోవాలని, మార్గదర్శకత్వం అందించటానికి తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. తాము చదువుకునేటప్పుడు మహిళలు పెద్దగా విద్యాసంస్థల్లో ఉండేవారు కాదని, ఇప్పుడు పెద్దసంఖ్యలో వస్తున్నారని, ఇది మంచి పరిణామమని అన్నారు. అయితే, చదువులో నాణ్యత లేకపోవడం వల్ల మహిళలు, పేదలకే ఎక్కువ నష్టం జరుగుతోందన్నారు. అందుకే నాణ్యమైన విద్య, ఆరోగ్యాల్ని అందరికీ అందించటాన్ని సురాజ్య లక్ష్యాల్లో భాగం చేశామన్నారు. సురాజ్య లక్ష్యాల్లోని చట్టబద్ధపాలన, లంచాల్లేని సేవలు, స్థానిక స్వపరిపాలన కూడా బాలికలు, మహిళల రక్షణకు, సాధికారతకు దోహదం చేస్తాయన్నారు. ఒట్టి నినాదాలుగా కాకుండా నిర్దిష్టమైన, హేతుబద్ధమైన పరిష్కారాలను అందిస్తున్నామన్నారు. వీటిని ఆకళింపు చేసుకుని కార్యాచరణగా మలచుకోవాలన్నారు.

ఈ సందర్భంగా నాగార్జునా యూనివర్సిటీ విజేతలుగా నిలిచిన బాలికలను జేపీ అభినందించారు. అనంతరం బాలికల వసతి గృహంలో మొక్కలను నాటారు.

డాక్టర్ కొర్రపాటి సుధాకర్, ప్రసాద్, వసతిగృహం అధికారి సీహెచ్ సరితాదేవి, జనవిజ్ఞానవేదిక ప్రతినిధులు, లోక్‌సత్తా, వైబీఐ నేతలు బండారు రామ్మోహనరావు, రమేష్‌రెడ్డి, శివరామకృష్ణ, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

శివరమేష్‌రెడ్డి, డాక్టర్ జవహర్, ప్రజా సైన్స్ వేదిక రాష్ట్ర ప్రతినిధి డాక్టర్ సి.ఎ ప్రసాద్, చీమకుర్తి జేవీవీ మండలాధ్యక్షుడు చలువాది రమేష్, భారతీయం అధ్యక్షుడు ఈదర భరత్, లోక్‌సత్తా, వైబీఐ ప్రతినిధులు పాల్గొన్నారు. ❍

# రామాయపట్నం, వెలిగొండల్ని వేగంగా పూర్తిచేయాలి



ఓడరేవు ఏర్పాటుకు రామాయపట్నం అన్నివిధాలుగా సౌకర్యవంతమైనదని, ఈ ప్రాంతంలో తన నిధులతో పోర్టును ఏర్పాటు చేసేందుకు కేంద్రప్రభుత్వం సిద్ధంగా ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేయకపోవటం దారుణమని జేపీ అన్నారు.

జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా ప్రకాశం జిల్లా కందుకూరులో మాట్లాడుతూ.. రామాయపట్నం పోర్టును ఏర్పాటు చేయటం హేతుబద్ధమైనదని తాను అసెంబ్లీలో కూడా పలుమార్లు కోరానని అన్నారు. విశాఖ షిప్‌యార్డు స్థలాన్ని తీసుకున్నందుకు ప్రత్యామ్నాయంగా.. రాష్ట్ర విభజనతో సంబంధం లేకుండానే రామాయపట్నం పోర్టును కేంద్రం కేటాయించిందని గుర్తుచేశారు. ఇంత ఆలస్యం తర్వాతైనా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో కలిసి చర్చించి రామాయపట్నం నిర్మాణానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. రామాయపట్నంతోపాటు మూడు జిల్లాల వెలుగొండ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాల్సి ఉందన్నారు. వెలిగొండ పనులు దాదాపు 11ఏళ్లుగా కొనసాగుతున్నా యన్నారు. ఇవి రెండూ ప్రకాశం జిల్లా అభివృద్ధిని వేగవంతం చేయగలవన్నారు. తాను కలెక్టర్‌గా వచ్చినప్పుడు ప్రకాశం జిల్లా అన్ని పరామితుల్లో వెనకబడి ఉందని, అభివృద్ధికి కావలసిన సరైన కక్ష్యలో ప్రవేశపెట్టటం వరకు మాత్రమే తాను చేశానని, మిగతాది ప్రజల భాగస్వామ్యంతో దానంతటదే జరిగిందని అన్నారు. అట్టడుగున ఉన్న జిల్లాకాస్తా మొదటి నాలుగైదు స్థానాల్లోకి వచ్చిందన్నారు. సక్రమ విధానాలు, పద్ధతులు నిరంతర ప్రక్రియగా కొనసాగాలన్నారు.

వెలిగొండ ప్రాజెక్టు ప్రధాన ఆనకట్ట పనులు, ఫిల్లింగ్ పనులు, ప్రధాన కాలువల పనులు కూడా పూర్తయినా.. మొదటి టన్నెల్ ఇంకా 4 కిలోమీటర్లు, రెండో టన్నెల్ 8 కిలోమీటర్లు తవ్వాల్సి ఉందని జేపీ వివరించారు. అత్యాధునిక మిషన్లు వినియోగిస్తున్నా రోజుకు 10 మీటర్లు మాత్రమే తవ్వే అవకాశముందన్నారు. దానికితోడు, సుమారు రూ.100కోట్ల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉన్నందున పనులు నెమ్మదిగా సాగుతున్నాయన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే బిల్లులు చెల్లించి పనులు త్వరగా సాగేలా చూడాలన్నారు. లోక్‌సత్తా తరపున రామాయపట్నం పోర్టు ఏర్పాటుకు, వెలిగొండ ప్రాజెక్టు పూర్తికి కృషి చేస్తామన్నారు.

ప్రధాన నగరాల్లో 10శాతం, పట్టణాల్లో 4శాతం, గ్రామాల్లో 1శాతం ప్రజలు లోక్‌సత్తా వైపు నిలుస్తున్నారని, రాజకీయ ప్రభావానికి ఈ ఓట్లు సరిపోవని, అందుకే ఎన్నికలకు దూరంగా ఉంటున్నామని ఓ ప్రశ్నకు సమాధానంగా జేపీ చెప్పారు. విద్య, వైద్య రంగాలపై దృష్టి పెట్టటం ద్వారానే ప్రభుత్వాలు మేలు చేయగలవని, అలాంటి కీలక్ష అంశాలనే సురాజ్య లక్ష్యాలుగా చేసుకుని సాధించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య, కోశాధికారి, జడ్పీటీసీ కంచర్ల శ్రీకాంత్, లోక్‌సత్తా ప్రతినిధులు బండారు రామ్మోహనరావు, డాక్టర్ రాధాదేవి, అల్లు శివరమేష్‌రెడ్డి, ప్రసాద్, మహ్మద్ రఫీ, వైబీఐ కన్వీనర్ వై.శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ❍

### పర్యావరణ పరిరక్షణ ర్యాలీ

*పర్యావరణ పరిరక్షణ కోసం ఒంగోలులో నిర్వహించిన ర్యాలీని జేపీ ప్రారంభించారు. ఈఎన్‌టీ వైద్యుడు డాక్టర్ కొర్రపాటి సుధాకర్ నేతృత్వంలో జరిగిన ర్యాలీ పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల నుంచి ప్రారంభమై కలెక్టరేట్ వరకు సాగింది. జేపీ విద్యార్థులతోపాటు సైకిల్ తొక్కి ఉత్సాహపరిచారు. తొలుత పీవీఆర్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.*



# ఏటా రూ.500 కోట్ల మార్కెట్ సెస్సు వసూలు.. రైతుల కోసం మాత్రం రూ.50 కోట్లు కూడా ఇవ్వలేరు

***మార్కెట్ యార్డుల ద్వారా జరిగే గిడ్డంగులు, సీసీ రహదారుల నిర్మాణం, ఇతర పనులు పూర్తిగా నేతల సిఫార్సుల మేరకే జరుగుతున్నాయి. రైతు పేరు చుట్టూనే ఈ రాజకీయమంతా జరుగుతుందికానీ రైతు అవసరాలను గుర్తెరగటం లేదు. ఉత్పత్తుల్ని మార్కెట్‌కు చేర్చడానికి వీలుగా ప్రతి 5 కిలోమీటర్లకు ఒక యార్డు చొప్పున ఏర్పాటు చేయాలి. ఈ లెక్కన రాష్ట్రవ్యాప్తంగా 2,000యార్డుల అవసరం ఉంది. ప్రస్తుతం 324 యార్డులు మాత్రమే ఉన్నాయి. మిర్చి అమ్మకాల కోసం రైతులంతా గుంటూరు యార్డుకు తరలిరావాల్సిందే. దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మార్కెట్ సేవలను గ్రామాల్లోని రైతులకు దగ్గరగా తీసుకెళ్లాలన్న లక్ష్యం దిశగా ఆ శాఖ ఏమాత్రం ప్రయత్నం చేయటం లేదు.***

రైతుల కోసం ఏర్పాటైన మార్కెట్ యార్డులను, వారి నుంచి వసూలు చేసే మార్కెట్ సెస్సును అధికార రాజకీయ పార్టీలు ఎలా దోచేస్తున్నాయో లోక్‌సత్తా పలుమార్లు ఎండగట్టింది. రాష్ట్ర విభజన తర్వాత కూడా రైతుల పట్ల ప్రభుత్వాల విధానాల్లో పెద్ద మార్పు రాలేదని ఆంధ్రప్రదేశ్‌లోని తాజా గణాంకాలు సూచిస్తున్నాయి.

పంట ఉత్పత్తుల అమ్మకం మొత్తంపై మార్కెట్ కమిటీలు ఒక శాతం చొప్పున రుసుము వసూలు చేస్తాయి. దీన్ని చెల్లించేది వ్యాపారులే అయినా రైతుల నుంచి పంటను కొనే సమయంలోనే వారు దీన్ని కూడా లెక్కేసుకుని ఆ మేరకు మినహాయించుకుంటారు. అంటే, ఈ భారాన్ని రైతులే మోస్తున్నారు. ఇలా రైతుల నుంచి వసూలు చేసిన సొమ్మును వారి కోసం ఖర్చు చేయడానికి రాజకీయ నేతల చేతుల్లో ఉండే వ్యవసాయ కమిటీలకు మనసొప్పటం లేదు. ఏపీలో పంట ఉత్పత్తుల అమ్మకాలపై ఒక శాతం రుసుము చొప్పున ఏటా రూ. 476 కోట్లు వసూలు చేస్తున్నా, కర్షకుల కోసం రూ. 50 కోట్లు కూడా ఖర్చు చేయటం లేదు. రాష్ట్ర విభజన దగ్గర్నుంచి 2017దాకా ఏపీలో రూ. 1385కోట్లు మార్కెట్ రుసుము వసూలైనట్టు అంచనా.

### రైతులు 80లక్షల మంది .. రైతుబంధు రుణాలు 3,500మందికి

మార్కెట్ కమిటీల నిధుల నుంచి పంట ఉత్పత్తులపై

రుణాలు అందించేందుకు ప్రవేశపెట్టిన రైతుబంధు పథకం అధికారులు, కమిటీ పాలకవర్గాల నిర్లక్ష్యం మూలంగా నీరుగారి ఉంది. రైతులకు రుణమాఫీ చేశామని చెప్పుకుంటున్న పాలకులు.. రైతుబంధు పథకాన్ని దెబ్బతీసి, చివరికి రైతులు ప్రైవేటు వడ్డీవ్యాపారుల బారిన పడేలా చేశారు. రైతుబంధులో పంటను గిడ్డంగిలో నిల్వ చేయడం ద్వారా దానిపై 75శాతం వరకు అప్పు ఇస్తారు. రూ.2 లక్షల వరకు ఆరు నెలలపాటు వడ్డీలేని రుణం ఇస్తారు.

◆ రాష్ట్రవ్యాప్తంగా 80లక్షలకు పైగా రైతులు వ్యవసాయం చేస్తుంటే రైతుబంధు పథకం ద్వారా రుణం పొందేవారు ఏటా సుమారు 3,500 మాత్రమే.

◆ 2014 నుంచి 2017 జనవరి వరకు మొత్తం 14,184మందికి రూ.147.26 కోట్లు మాత్రమే అందాయి. 2017-18 (జనవరి వరకు)లో రూ.43.39 కోట్ల రుణాన్ని మాత్రమే ఈ ఖాతా కింద అందచేశారు. మిర్చి క్రయవిక్రయాలు అధికంగా ఉండే గుంటూరు మిర్చియార్డులో ఒక్కరికీ రైతుబంధు రుణం అందలేదు. చిత్తూరు, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనంతపురం.. ఇలా పలు జిల్లాల్లో ఎక్కడా రుణాలు రూ.1కోటి చేరుకోలేదు. రుణగ్రహీతల్లో 90శాతం వ్యాపారులేనని ఎమ్మెల్యేలే చెబుతున్నారు. నిజమైన రైతులు మాత్రం బయట 24 నుంచి 48 శాతం వరకు వడ్డీకి అప్పు తెచ్చుకుంటున్నారు.

**నేతల సిఫార్సుల మేరకే పనులు**

మార్కెట్ యార్డుల ద్వారా జరిగే గిడ్డంగులు, సీసీ రహదారుల నిర్మాణం, ఇతర పనులు పూర్తిగా నేతల సిఫార్సుల మేరకే జరుగుతున్నాయి. రైతు పేరు చుట్టూనే ఈ రాజకీయమంతా జరుగుతుందికానీ రైతు అవసరాలను గుర్తెరగటం లేదు. ఉత్పత్తుల్ని మార్కెట్‌కు చేర్చడానికి వీలుగా ప్రతి 5 కిలోమీటర్లకు ఒక యార్డు చొప్పున ఏర్పాటు చేయాలి. ఈ లెక్కన రాష్ట్రవ్యాప్తంగా 2,000యార్డుల అవసరం ఉంది. ప్రస్తుతం 324 యార్డులు మాత్రమే ఉన్నాయి. మిర్చి అమ్మకాల కోసం రైతులంతా గుంటూరు యార్డుకు తరలిరావాల్సిందే. దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మార్కెట్ సేవలను గ్రామాల్లోని రైతులకు దగ్గరగా తీసుకెళ్లాలన్న లక్ష్యం దిశగా ఆ శాఖ ఏమాత్రం ప్రయత్నం చేయటం లేదు. అదనపు ధర పథకం కింద ఈ సంవత్సరం నందిగామ, జగ్గయ్యపేట, పర్చూరు, దాచేపల్లి, కర్నూలులో మిర్చి కొనుగోళ్లు ప్రారంభించినా నామమాత్రంగానే చేశారు. ఎక్కువ సంఖ్యలో మార్కెట్ యార్డులు కావచ్చు, మరోరకమైన ఏర్పాటు కావచ్చు.. రైతులకు మార్కెట్‌లను ఎంత దగ్గరలోకి తెస్తే అంత మంచి ధర లభించే అవకాశం ఉంటుంది.

**ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడం వల్లే..**

మార్కెట్ సేవలపై ప్రభుత్వం ఏమాత్రం దృష్టి పెట్టటం లేదు. యార్డుల పరిధిలో పశువైద్య శిబిరాల నిర్వహణ మొక్కుబడిగా మారింది. కౌలురైతులకు బ్యాంకుల నుంచి రుణాలు బాగా తక్కువగా ఉన్న నేపథ్యంలో రైతుబంధు పథకం వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కూడా ప్రభుత్వం గుర్తించటం లేదు. పంట వేయకముందు, పంట చేతికొచ్చాక కూడా రుణసదుపాయం రైతులకు అందుబాటులో లేకపోవడానికి పాలకుల విధానాలే కారణమనటానికి మార్కెట్ యార్డుల పట్ల ప్రభుత్వం తీరే నిదర్శనం. ❍

# ఏపీలో పెరుగుతున్న వర్కింగ్ ఫోర్స్

ఏపీలో 29-60 ఏళ్ల వయసులో పనిచేసేవారి జనాభా (వర్కింగ్ ఫోర్స్) ప్రస్తుతం 54.7శాతం ఉండగా, 2026నాటికి 59.0శాతానికి పెరగనుంది. మరోవైపు గ్రామీణ జనాభా భారీగా తగ్గిపోనుండగా పట్నంవాసులు అంతకన్నా భారీగా పెరగనున్నారు. ప్రస్తుతం రాష్ట్ర జనాభా 4.9కోట్ల మందిలో పల్లె జనాభా 3.48కోట్లుగా ఉంది. అయితే 2031నాటికి పట్టణాల్లో నివాసం ఉండేవారి సంఖ్య దాదాపు రెట్టింపయి 2.79కోట్లకు చేరనుంది. వర్కింగ్ ఫోర్స్ జనాభా పెరగడం ఆనందించాల్సిన విషయమే అయినా, వారందరికీ ఉపాధి, పెరుగుతున్న పట్టణాల్లో మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరముంది. ఈ ఆందోళన కొంతమందిలోనైనా కనిపిస్తోంది, కానీ పల్లెల్లో మౌలిక వసతులు కల్పించటం గురించి ఆలోచించాలని, గ్రామాలు-పట్టణాలు మధ్య అంతరాన్ని తగ్గించకుంటే పట్టణీకరణ, నిరుద్యోగం రాష్ట్రాన్ని కుదిపేస్తాయని లోక్‌సత్తా సీనియర్ నేత ఒకరు అన్నారు. ఏపీలో 20 ఏళ్లలోపు యువత ప్రస్తుతం 1.69కోట్లమంది (34.6శాతం) ఉండగా, 2026నాటికి 1.47కోట్ల (26.5శాతం)కు తగ్గిపోతుందని, యువశక్తి సదవకాశం చేజారకముందే మేలుకోవాలని అన్నారు. ఈ అంశాలపై జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో కూడా విస్తృతంగా చైతన్యపరిచామన్నారు. ❍

# ఎన్నికల కోసం రాష్ట్ర ప్రయోజనాలను బలిపెట్టొద్దు




ప్రజలకు ప్రయోజనం చేకూర్చే పనులు ఎవరు చేసినా సహకారం అందించటం, ఎవరూ చేయకపోతే తానే చేయటం తొలి నుంచీ లోక్‌సత్తా సంస్కృతని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. రాష్ట్ర విభజన విషయంలోనూ ఇలాగే వ్యవహరించామన్నారు. ఓట్లు, సీట్లు వచ్చినవాళ్లు చట్టసభల నుంచి వలాయనం చిత్తగించి ప్రజల్ని వెర్రెక్కిస్తుంటే.. లోక్‌సత్తా మాత్రమే అసెంబ్లీలో ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలను పరిరక్షించేలా ప్రత్యేక హోదా తదితర కీలక ప్రతిపాదనల్ని చేసిందన్నారు. పార్లమెంటులో ప్రధాన పార్టీల్ని ఒప్పించిందన్నారు. విభజన జరిగాక కూడా రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై అందరికంటే ముందు 2015 నుంచే లోక్‌సత్తా పోరాటం ప్రారంభించిందని విజయనగరంలో మీడియాతో మాట్లాడుతూ బాబ్జీ అన్నారు. ఇటీవల పార్టీలకతీతంగా జేఎఫ్‌సీ (సంయుక్త నిజనిర్ధారణ సంఘం), ఆ తర్వాత దానికి కొనసాగింపుగా ఐజీఈ (స్వతంత్ర నిపుణుల బృందం).. ఇవన్నీ ఇతరులతో కలిసో, సొంతంగానో లోక్‌సత్తా ప్రజాప్రయోజనాల కోసం చేస్తున్న అలుపెరుగని కృషిలో భాగమేనన్నారు. రైల్వేజోన్ సహా విభజన హామీలను సాధించుకోవడానికి ఉత్తరాంధ్రలోని సంస్థలు, నేతలు నిర్వహిస్తున్న పలు కార్యక్రమాల్లోకకూడా లోక్‌సత్తా చురుకైన భాగస్వామ్య పాత్ర పోషిస్తోందన్నారు. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జరిగిన అఖిల పార్టీ, పక్ష సమావేశాల్లో కూడా నిర్దిష్టమైన పరిష్కారాలను సూచించామన్నారు. చంద్రబాబు తప్పిదాల్ని లోక్‌సత్తా పలుమార్లు ఎత్తిచూపిందని, బహిరంగంగా విమర్శించిందని, కానీ రాష్ట్ర ప్రయోజనాల రీత్యా ముఖ్యమంత్రితో కలిసి పనిచేయటం కూడా అవసరమని బాబ్జీ అన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలకు సారథులుగా తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ముందుండి విభజన హక్కుల సాధన చేయాలని 2015లోనే లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ విజ్ఞప్తి చేశారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి అఖిలపక్షానికి చొరవ తీసుకోవాలని కోరి కూడా వైకాపా, జనసేన అఖిల పక్షాలకి హాజరుకాకపోవటం సరికాదన్నారు. రాజకీయ వైఖరులను ఎన్నికలప్పుడు ప్రదర్శించుకోవాలని, ఇప్పుడు రాష్ట్ర ప్రయోజనాల కోసం మాత్రం అందరూ కలసికట్టుగా కృషి చేయాలని అన్నారు. సొంతంగా పోరాడుతూ కూడా ఈ పనిచేయవచ్చన్నారు. భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు భూములను డీనోటిఫై చేయాలని, జిల్లాలో మూతపడిన జ్యూట్ మిల్లును తెరిపించాలని, పంచదార ఫ్యాక్టరీలకు స్వావలంబన కల్పించాలని ముఖ్యమంత్రిని కోరినట్టు బాబ్జీ తెలిపారు. సంబంధిత వివరాలు సేకరించాలని వెంటనే ఆయన ఆదేశించారని, సమస్యల్ని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని తెలియచేశారు. లోక్‌సత్తా పార్టీ నాయకులు రాజారావు, భాస్కర్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. ❍

# సతీష్ చందర్‌కి పతంజలి పురస్కారం



అక్షరాలతోనే పతంజలితో తనకు పరిచయమని ప్రముఖ కవి, రచయిత, పాత్రికేయుడు సతీష్ చందర్ అన్నారు. పతంజలి పుస్తకాలను చదవటం చెదరని అనుభూతి, స్ఫూర్తి అని అభివర్ణించారు. పతంజలిని కలవాలని ఎన్నోసార్లు భావించానని, అయితే యాదృచ్ఛికంగా ఆయనతోనే కలిసి సంపాదకవర్గంలో పనిచేసే సదవకాశం లభించిందని గుర్తు చేసుకున్నారు. కేఎన్‌వై పతంజలి సాంస్కృతిక వేదిక ఏటా ఇచ్చే పతంజలి పురస్కారాన్ని ఈ ఏడాది సతీష్ చందర్ అందుకున్నారు. విజయనగరంలో జరిగిన ఈ కార్యక్రమంలో వేదిక అధ్యక్షుడు, లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, జిల్లా ఎస్పీ పాలరాజు, పలువురు సాహిత్యాభిమానులు, పౌరులు పాల్గన్నారు. పతంజలి సాహిత్యాన్ని చిన్న పుస్తకాల రూపంలో అందరికీ అందేలా చేస్తామని పతంజలి సతీమణి ప్రమీల ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో 'రాజుగోరు వీరబబ్బిలి' పుస్తకాన్ని ఆవిష్కరించారు.

---

# ప్రజారవాణాను మెరుగుపరచండి



ప్రజలు ఉన్నకొద్దీ సొంతవాహనాలవైపు మొగ్గు చూపేలా ప్రభుత్వాలు వ్యవహరించటం దుష్పరిపాలనలో భాగమేనని వెంకటరమణబాబు అన్నారు. బస్సులను సౌకర్యవంతంగా మార్చటంతోపాటు రద్దీకనుగుణంగా వేగంగా అందుబాటులోకి తేవాలన్నారు. రాయదుర్గం నుంచి బళ్లారి, అనంతపురం పట్టణాలకు నాన్‌స్టాప్ బస్సుల్ని నడిపితే ఆదాయం పెరుగుతుందని, ప్రజలకు ఉపయోగంగా ఉంటుందని రాయదుర్గం డిపో ఉన్నతాధికారులను కలిసి బాబు వివరించారు.

---

# పట్టణంలో ప్రజాసమస్యల్ని పట్టించుకోండి





పట్టణంలో పందులు, కుక్కలతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, తాగునీటి సమస్యలను ఎదుర్కొంటున్నారని, పలుచోట్ల వీధిదీపాలు వెలగటం లేదని, రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని వీటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని లోక్‌సత్తా పార్టీ నేతలు విజయనగరం మునిసిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్లను కలిసి విజ్ఞప్తి చేశారు. పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు మొల్లేటి చిన్నారావు (నాయుడు), కార్యదర్శి తాత్రాజు రాజారావు, బి. సన్యాసినాయుడు, పతివాడ చంద్రరావు, సిమ్మ శ్రీను, కె.శ్రీను, భాస్కర్, ఆదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ❍

# (మీడియాలో) 'కీ' కామెంట్లు!

❖ వాక్లవ్ హావెల్ వెల్వెట్ రివల్యూషన్ కారణంగా ప్రేగ్ నగరంలో కమ్యూనిజం కకావికలైంది. అక్కడ మీరు ప్రయాణించే కారు డ్రైవర్ ఒక అణుప్రయోగశాలలో ఉద్యోగం పోగొట్టుకున్న కంప్యూటర్ ఇంజినీర్ అయి ఉండవచ్చు. మేం ప్రయాణించిన కారు డ్రైవర్ అలాంటివాడే. మా సంభాషణ అనివార్యంగా కమ్యూనిజం వైఫల్యాలు, తీవ్రచర్యల మీదకు మళ్లింది. భారతదేశంలో సోషలిజం ఇప్పటికీ ఎందుకు ప్రాచుర్యం కోల్పోకుండా ఉంది వంటి ప్రశ్న నుంచి చాలా ప్రశ్నలే అడిగాడు. అలాగే ముఖ్యమైన రాష్ట్రాలలో తరచూ సోషలిస్టులు ఎందుకు ఎన్నికవుతారని కూడా అతడు ప్రశ్నించాడు. దానికి అతడే సమాధానం కూడా చెప్పాడు. మీ సోషలిజం మా సోషలిజం కంటే భిన్నమైనదని అన్నాడు. మా సోషలిస్టులు మా రాజకీయ, ఆర్థిక స్వేచ్ఛలను మా నుంచి దూరంగా తీసుకుపోయారు. కానీ మీ స్వేచ్ఛలు మీ దగ్గరే ఉన్నాయి అన్నాడు. ఎమర్జెన్సీ సమయంలో వాటిని ప్రభుత్వం లాక్కున్నా మళ్లీ మీరు సాధించుకున్నారని కూడా వ్యాఖ్యానించాడు. అయితే మీరు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని ఎన్నడూ రుచిచూడలేదు కాబట్టి సోషలిజం మిమ్మల్ని నష్టపరిచింది ఏమిటో మీరు అర్థం చేసుకోలేరు. అతడు చెప్పింది నిజమే. మనం ఇప్పుడు ఒక బూటకపు సోషలిస్టు ఆర్థిక వ్యవస్థలో కూరుకుపోయి ఉన్నాం.

– శేఖర్ గుప్తా, సీనియర్ సంపాదకులు

❖ ఆ రోజు ఉదయం ముంబయి నగరవాసులకు మహాశ్చర్యం కలిగింది. ఎందుకంటే ఆందోళనకారులు కొత్త బాట పట్టారు. సుదీర్ఘ ర్యాలీ పొడవునా నడుచుకుంటూ వచ్చిన రైతులు నాసిక్ నుంచి థానే హైవేలో కూడా తమ ఊరేగింపుతో ట్రాఫిక్‌కు బాగా అంతరాయం కలగడం చూశారు. దాంతో ముంబయి ప్రజలను ఇబ్బంది పెట్టకూడదని నిర్ణయించుకున్నారు. ఇది ఒకరకంగా చెప్పాలంటే తెలివైన ప్రజాసంబంధాల నిర్వహణావ్యూహం కావచ్చు. దీంతో ప్రభుత్వం ఈ ర్యాలీని తేలిగ్గా తీసుకునే పరిస్థితి లేకుండా పోయింది. రైతుల డిమాండ్లు తక్కువగా మాత్రం లేవు. అలాగని వారు దురాశాపరులేమీ కాదు. గత కొంతకాలంగా మన వ్యవస్థ రైతుల జీవనాధారాన్ని కొల్లగొట్టి వారిని తీవ్ర కష్టాలపాలు చేస్తూ వచ్చింది. ముంబయికి 160 కిలోమీటర్ల దూరంలోని నాసిక్ నుంచి రైతుల లాంగ్‌మార్చ్ మొదలైంది. రోజు తర్వాత రోజు వారు ప్రధాన రహదారి గుండా కొన్ని ప్లకార్డులు పట్టుకుని నినాదాలు కూడా చేయకుండా నడుచుకుంటూ వచ్చారు. అయితే వారి నిశ్శబ్దమే గట్టిగా సవ్వడి చేస్తూ వచ్చింది. ముంబయి మీడియా అయితే రైతుల యాత్రను పెద్దగా పట్టించుకోలేదు. మొబైల్‌ఫోన్‌లో ఈ యాత్ర గురించిన ఫోటోను తీసి సోషల్ మీడియాలో దాన్ని షేర్‌చేయటం తప్ప పెద్దగా స్పందించలేదనే చెప్పాలి. కానీ రైతుల ర్యాలీ థానే చేరుకున్నప్పుడు మాత్రమే మీడియా మేల్కొంది. ఆ ఊరేగింపు ముంబయి నగరానికి వస్తే ట్రాఫిక్‌కి బాగా ఇబ్బంది కలుగుతుంది. ట్రాఫిక్‌కి అంతరాయం కలగడమే ఊరేగింపు విజయానికి కొలమానం కదా. కాబట్టే మీడియా ఒక విధమైన చికాకుతో థానే వద్ద ఖాళీ గస్తీ పోస్టు వద్ద టీవీ చర్చను నిర్వహించింది. ఆ ఒక్క టీవీ యాంకర్ కూడా అసలు రైతులు ఎందుకు మార్చ్ చేస్తున్నట్టు అని ప్రశ్నించడం గమనార్హం. తాము పాదయాత్ర ఎందుకు తలపెడుతున్నామో చెబుతూ నిర్వాహకసంస్థ చాలా ముందుగానే డిమాండ్ల జాబితాను ప్రచురించింది.

- మహేష్ విజాపుర్కర్, సీనియర్ జర్నలిస్టు

❖ ఎన్నికల్లో ఎలాగైనా గెలవడమే ముఖ్యమన్న పిచ్చి బీజేపీని పట్టుకుంది. పార్టీ మూల సంప్రదాయాలు నాశనమైపోయాయి. 2004లో నేను చేరినప్పటిలా పార్టీ ఇప్పుడు లేదు. అందుకే బీజేపీ నుంచి వైదొలుగుతున్నాను. దేశానికి విభిన్నమైన రాజకీయ ప్రత్యామ్నాయం అవసరం.

– ప్రద్యుత్ బోరా, బీజేపీ ఐటీ విభాగ వ్యవస్థాపకుడు

❖ ఈ 70 ఏండ్ల శూన్యం నుంచి ఆవిర్భవించే కొత్త వేదిక దేశంలో 'గుణాత్మకమైన మార్పు'ను తెచ్చేది కావాలని, కొత్త చరిత్రను సృష్టించాలని కేసీఆర్ అంటున్నారు. అటువంటి మార్పును తేగలిగేందుకు ప్రాథమిక సాధనాలు ఎన్నికలు, ప్రభుత్వాలు అవుతాయన్నది నిజమే. అదే సమయంలో ఆ ప్రభుత్వపు దార్శనికత, విధానాలు, ఆచరణ అన్నవి అంతిమ సాధనాలు అవుతాయి. దేశ నేపథ్యం, 70 ఏండ్ల అనుభవాలు, వర్తమాన-భవిష్యత్ అవసరాలను బట్టి ఈ కార్యపు మహత్తరత్వాన్ని చూస్తే, ఇందుకు కేసీఆర్ తన జీవితాన్నే అంకితం చేయవలసి వస్తుంది.

– టంకశాల అశోక్, సీనియర్ జర్నలిస్టు

❖ *ఉత్తరాదిలో శక్తి ఉంది, దక్షిణాదిలో మేధాశక్తి ఉంది. ఈ రెండింటి సమన్వయంగా మనం జాతిని అభివృద్ధి చేయాలన్న జయేంద్ర సరస్వతి స్వామి వారి మాటలు గొప్పవి. ఆధ్యాత్మిక మూర్తులు లోకకళ్యాణమే ధ్యేయంగా ఆలోచనలు సాగిస్తారనటానికి స్వామి వారి ఈ సూచనలే తార్కాణం.*

*– డాక్టర్ మండలి బుద్ధప్రసాద్, ఉపసభాపతి, ఆంధ్రప్రదేశ్ శాసనసభ*

❖ ప్రైవేట్ మీడియా.. దూరదర్శన్‌లా మారిపోయింది. ప్రభుత్వాలకు మౌత్‌పీస్‌లా తయారవుతోంది. వాచ్‌డాగ్‌లా ఉండాల్సిన మీడియా పరిస్థితి.. ల్యాప్‌డాగ్‌లా మారింది. డిజిటల్ మీడియాను రాజకీయ పార్టీలు శాసిస్తున్నాయి. వచ్చే ఎన్నికల యుద్ధం క్షేత్రస్థాయిలోకన్నా, టీవీ ఛానళ్లలో కన్నా వాట్సాప్‌లలోనే ఎక్కువగా జరగనుంది. సోషల్ మీడియాలో వెరిఫికేషన్ లేకపోవడం వల్ల తప్పుడు వార్తలే ఎక్కువగా ప్రచారం అవుతున్నాయి. వీటిని నిజమని ప్రధాన స్రవంతి మీడియా నమ్మినపుడు ప్రమాదం జరుగుతుంది. దేశంలో విశ్వసనీయ మీడియా రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వచ్చే ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలదే హవా ఉండొచ్చు. మోదీ, అమిత్ షాల పోల్ మేనేజ్‌మెంట్ విజయవంతంగా ఉంది. కాంగ్రెస్ ప్రైవేట్ ఫ్యామిలీ కంపెనీలా ఉంది. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ నాలుగేళ్ల పదవీకాలంలో నాకొక్కడికే ఇంటర్వ్యూ ఇచ్చారు. రూలర్స్ మాత్రమే ఈ తరహాలో వ్యవహరిస్తారు.

– రాజ్‌దీప్ సర్దేశాయ్, సీనియర్ జర్నలిస్టు

❖ ***ఢిల్లీలో తలసరి నీటి లభ్యత ఆమ్‌స్టర్‌డామ్‌లో కంటే ఎక్కువ. జనాభాపరంగా ప్రపంచ ప్రథమస్థానంలో ఉన్న చైనా ద్వితీయ స్థానంలో ఉన్న భారత్ కంటే 28 శాతం తక్కువగా మంచినీటిని వినియోగించుకుంటోంది. జలసంపద మనకు కావలసినంత ఉన్నది. అయినా తీవ్ర నీటికొరత మనలను నిత్యం సతమతం చేస్తున్నది. మన జాతీయ జలసంపదలో 80 శాతం వ్యవసాయ అవసరాలకే వినియోగమవుతోంది. నీరు అమితంగా అవసరమయ్యే పంటలకు మనం అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నాం. రైతులు వినియోగించుకునే నీటికి ధరను పెంచాలని కోరితే చెరకు నుంచి వచ్చే పంచదార ధర పెరుగుదలను నగరవాసులు భరించాలి. దీనిల్ల సాగునీటికి డిమాండ్ తగ్గుతుంది. నగరవాసుల అవసరాలకు నీరు సమృద్ధిగా లభిస్తుంది.***


***– భరత్ ఝున్‌ఝున్‌వాలా, ఆర్థికవేత్త***

(కర్టెసీ: ఈనాడు, సాక్షి, ఆంధ్రజ్యోతి, నమస్తే తెలంగాణ, సోషల్ మీడియా) ❍

## కేంద్ర చట్టాన్ని తీసుకోవద్దు.. ఎఫ్‌డీఆర్ బిల్లు నమూనాలో కొత్త శాసనం చేయండి

# – క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టంపై ఏపీ ముఖ్యమంత్రికి జేపీ లేఖ –

ప్రభుత్వేతర ఆస్పత్రుల నమోదు, నియంత్రణకు సంబంధించి 252 అధికరణం కింద పార్లమెంటు ఆమోదించిన 'క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం, 2010'ని శాసనసభ సెలెక్ట్ కమిటీకి పంపించాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం విజ్ఞతతో కూడినదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) ప్రధాన కార్యదర్శి, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అభినందించారు.


// DRAFT BILL //

**The Andhra Pradesh Informed Choice of Clinical Establishments Bill, 2017**

Foundation for Democratic Reforms (FDR)*
www.fdrindia.org

* FDR is a recognized research organization (SIRO) under the DSIR, Ministry of Science & Technology, Govt. of India.

లైసెన్స్-పర్మిట్ అవరోధాలు, ప్రైవేటు పెట్టుబడులకు అనవసర అవాంతరాలు లేకుండా, ప్రజలకు తేలిగ్గా నాణ్యమైన వైద్యసేవలు అందుబాటులోకి వచ్చేలా.. ఏపీ ఆరోగ్యశాఖ మంత్రి అభ్యర్థన మేరకు వైద్యులు, సంబంధిత ఇతర వర్గాలందరితో కూర్చుని ఎఫ్‌డీఆర్ తరపున ఒక సమగ్ర బిల్లును రూపొందించి సెప్టెంబర్ 2017లో రాష్ట్ర ప్రభుత్వానికి పంపామని జేపీ గుర్తుచేశారు. అదనపు సమస్యల్ని సృష్టించే కేంద్ర ప్రభుత్వ బిల్లును ఆమోదించకుండా.. ప్రజాప్రయోజనాలను పరిరక్షించేందుకు ఎఫ్‌డీఆర్ సమతూకంతో రూపొందించిన బిల్లు నమూనాలో కొత్త చట్టాన్ని ఆంధ్రప్రదేశ్ తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు చంద్రబాబుకు జేపీ రాసిన లేఖను లోక్‌సత్తా వర్గాలు మీడియాకు విడుదల చేశాయి.

కేంద్ర ప్రభుత్వ చట్టాన్ని రాష్ట్రాలు ఒకసారి ఆమోదిస్తే, రాజ్యాంగంలోని ఆర్టికల్ 252(2) ప్రకారం దానిలో మున్ముందు మార్పులు చేర్పులు చేయాలంటే పార్లమెంటు ద్వారానే చేయాలి తప్ప రాష్ట్ర శాసనసభలో సాధ్యం కాదనే కీలకాంశాన్ని కూడా ఈ సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి దృష్టికి జేపీ తీసుకెళ్లారు. రాష్ట్ర అధికారాల పరిధిలోని (వైద్య ఆరోగ్యం వంటి) అంశమే అయినా కూడా పార్లమెంటు చట్టాన్ని శాసనసభ ఆమోదిస్తే, ఆ చట్టాన్ని తిరిగి వెనక్కి తీసుకునే, మార్చే అధికారం రాష్ట్రానికి ఉండదన్నారు. రాష్ట్రం తన పరిధిలోని అంశంపై స్వచ్ఛందంగా పార్లమెంటుకు తన అధికారాలను అప్పగించి తలగ్గినట్టవుతుందన్నారు.

7వ షెడ్యూల్ ప్రకారం రాష్ట్రాల పరిధిలోని అంశంపై పార్లమెంటుకు ఇంత ఏకపక్ష అధికారాన్నిచ్చే నిబంధన ఫెడరల్ స్ఫూర్తికే విఘాతమని జేపీ వివరించారు.

ఎఫ్‌డీఆర్ రూపొందించిన క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ బిల్లును, నివేదికను, నేపథ్య సమాచారాన్ని కూడా లేఖతో పాటు ఏపీ ముఖ్యమంత్రికి జయప్రకాష్ నారాయణ్ పంపారు.

Draft Bill and related documents available at:

http://www.fdrindia.org/letter-to-ap-health-minister-on-clinical-establishment-act/ ❍









# హక్కుగా పౌర సేవల చట్టం కోసం మళ్లీ లోక్‌సత్తా కార్యాచరణ



సర్టిఫికెట్లు, తాగునీరు, విద్యుత్ కనెక్షన్లు, భూ రికార్డులు, పట్టాదారు పాసుపుస్తకాలు వంటి రోజువారీ సేవల్ని లంచాలు లేకుండా హక్కుగా ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లో అందించేందుకు "పౌరసేవల" చట్టాన్ని తీసుకొచ్చేందుకు లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ మరోమారు తన కార్యాచరణను ప్రారంభించింది. ఇందుకోసం వివిధ పార్టీల ముఖ్య నేతలను, ప్రజాప్రతినిధులను కలిసి విజ్ఞప్తి చేయటంతోపాటు ప్రజల్లో చైతన్యం పెంచేందుకు కరపత్రాల ద్వారా ప్రచారం చేస్తోంది. కాంగ్రెస్, బీజేపీ, తెదేపా సహా ప్రతిపక్షాలన్నీ లోక్‌సత్తా రూపొందించిన పౌర సేవల బిల్లుకు రౌండ్‌టేబుల్ సమావేశాల్లో మద్దతు పలికాయని, ఆ బిల్లును ముఖ్యమంత్రి కేసీఆర్‌కు లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ 2016 అక్టోబర్‌లోనే పంపారని, తెరాస ప్రభుత్వం కూడా సానుకూలత వ్యక్తం చేసినా ఆచరణలో మాత్రం చర్యలు లేవని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా॥ పాండురంగారావు అన్నారు. బిల్లు ప్రతులను మళ్లీ కేసీఆర్‌కు, కేటీఆర్, జూపల్లి, ఇతర సంబంధిత మంత్రులకు, అధికారులకు పంపుతున్నామని తెలిపారు. అరుణాచల్‌ప్రదేశ్ ఎంపీ కూడా ఇటీవల ఈ బిల్లును ప్రైవేటుగా పార్లమెంటులో ప్రతిపాదించి సంగతిని గుర్తు చేశారు. లోక్‌సత్తా రూపొందించిన పౌర సేవల బిల్లు చట్టమైతే... ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతి పనికీ నిర్దిష్ట గడువు ఉంటుందని, ఆలోగా చేయలేకపోతే రోజుకు కనీసం రూ.250 పరిహారం దరఖాస్తుదారునికి ప్రభుత్వం చెల్లించాల్సి వస్తుందని వివరించారు. ఈ చట్టాన్ని సాధించే వరకు తమ పోరాటం సాగుతుందన్నారు. కార్యక్రమాల్లో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు, జీహెచ్ఎంసీ నేతలు, పార్టీలకతీతంగా వైదివి ప్రతినిధులు పాల్గొంటున్నారన్నారు.

Posting Date 22-04-2018

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on April 16th, 2018




# సరైన శిక్షణా సంస్థలు పెరగాలి

కేవలం వ్యాపార దృక్పథంతో కాకుండా... నిరుద్యోగ సమస్యను నిర్మూలించాలనే లక్ష్యంతో శిక్షణా సంస్థలు పనిచేయాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ విజ్ఞప్తి చేశారు. పాఠశాల స్థాయి నుంచే నాసిరకం చదువు అందుతుండటం వల్ల మనదేశంలో నిరుద్యోగం తాండవిస్తోందన్నారు. ఏటా 1కోటి 30 లక్షల ఉద్యోగాలు కావాల్సి ఉండగా, 5 లక్షలతో సరిపెడుతున్నారన్నారు. మంచి ప్రమాణాలతో నిపుణులతో శిక్షణనందించే సంస్థలు పెరిగితే... ప్రైవేటులో కూడా అవకాశాలు పెరిగి నిరుద్యోగాన్ని కొంతమేర కట్టడి చేయగలమన్నారు. జాతీయస్థాయి పోటీపరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థుల కోసం హైదరాబాద్ వెంగళరావునగర్‌లో ఏర్పాటైన పసిఫిక్ ఎడ్యుకేర్ సంస్థ ప్రారంభోత్సవంలో జేపీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. యూజీసీ సభ్యుడు డా॥ జి. గోపాల్‌రెడ్డి, ఎస్‌ఎస్‌ఐఎస్‌టీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా॥ పెసరసింహారెడ్డి, ఉండి ఎమ్మెల్యే శివరామరాజు, బీజేపీ ఢిల్లీ నేత రామేశ్వర ప్రసాద్, పసిఫిక్ ఎడ్యుకేర్ నిర్వాహకుడు ఎస్.కె. కుమార్ తదితరులు పాల్గొన్నారు.




**Book-Post**

PRINTED MATTER

If not delivered please return to:

**Lok Satta Times**

Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

To

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad